
E-KABURU E-PAPER
# ఈ-కబురు
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
@ekaburu.com
(తేదీ) 24-07-2025 (వారం) గురువారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



కంచ గచ్చిబౌలి కేసు.. సుప్రీం కోర్టు మరో వార్నింగ్ » 2లో

ఇంగ్లాండ్‌తో నాలుగో టెస్టు.. తొలి రోజు ముగిసిన ఆట.. భారత్ 264/4 » 6లో



ఐటీ రిటర్న్ కొత్త డెడ్‌లైన్.. మిస్ అయితే పెద్ద తలనొప్పే! » 4లో



రతన్ టాటా కూడా పెళ్లి చేసుకోలేదు కదా: నిత్యామేనన్ » 5లో



# 42 శాతం బీసీ రిజర్వేషన్లు సాధిస్తాం

- బీసీ రిజర్వేషన్లపై బీజేపీది ద్వంద్వ వైఖరి
- అసెంబ్లీలో మద్దతు.. కేంద్రంలో తాత్సారం
- రాష్ట్ర బీజేపీ కొత్త అధ్యక్షుడిది వితండవాదం
- ముస్లింల సాకుతో బీసీ రిజర్వేషన్లకు మోకాలడ్డు
- ఉపరాష్ట్రపతి పదవిని దత్తాత్రేయకు ఇవ్వాలి
- తెలంగాణ ప్రజల తరపున కేంద్రాన్ని కోరుతున్నా
- ఢిల్లీలో మీడియా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి



ఈ కబురు, ఢిల్లీ:కేంద్రం మెడలు వంచైనా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధిస్తామని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గతంలో మూడు వ్యవసాయ నల్లచట్టాలు చేస్తే.. వాటిని ఉపసంహరించుకునేలా చేశామని గుర్తు చేశారు. తొలుత మొండికేసిన బీజేపీ ప్రభుత్వ మెడలు వంచి రద్దు చేయించామని అన్నారు. చివరికి కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోదీ రైతులకు క్షమాపణలు చెప్పాల్సి వచ్చిందన్నారు. బుధవారం ఢిల్లీ తుగ్లక్ రోడ్డులోని ముఖ్యమంత్రి అధికారిక నివాసంలో రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లపై బీజేపీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని ఆరోపించారు. "బీజేపీ వాళ్లు వితండవాదం చేస్తున్నారు. శాసనసభలో చర్చ జరిగినప్పుడు తీర్మానానికి బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం, సీపీఐ మద్దతు ఇచ్చాయి. ఓవైపు తెలంగాణలోని బీజేపీ ఎమ్మెల్యేలు మద్దతు ఇస్తుంటే.. కేంద్ర బీజేపీ తాత్సారం చేస్తోంది. ఇక ఆ పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు రాంచందర్‌రావు మాత్రం 'మీరెలా చేస్తారు? మీరు హామీ ఇచ్చుకుంటే మీరే చేసుకోండి' అని అంటున్నారు. లేదంటే ముస్లింలను రిజర్వేషన్ల నుంచి తొలగించండని వితండవాదం చేస్తున్నారు. ఇవాళ బీజేపీకి, కాంగ్రెస్‌కు వేర్వేరు రాజ్యాంగాలు లేవు. అందరికీ అంబేడ్కర్ రాజ్యాంగం ఒక్కటే. ఆ రాజ్యాంగానికి లోబడే రిజర్వేషన్లు పెంచాలంటున్నాం" అని రేవంత్‌రెడ్డి అన్నారు. వందేళ్ల నుంచి వాయిదా పడుతూ వస్తున్న బీసీ రిజర్వేషన్లు, కులగణనను తెలంగాణ ప్రభుత్వం విజయవంతంగా పూర్తిచేసిందని తెలిపారు. దేశానికి తెలంగాణ రోల్ మోడల్‌గా నిలిచిందని, దానిని బీజేపీ, బీఆర్ఎస్ ఓర్వలేకపోతున్నాయని మండిపడ్డారు.

తరువాయి 2లో


# విశాఖలో 20,216 కోట్ల పెట్టుబడులు

- విశాఖలో 20,216 కోట్ల పెట్టుబడులు
- 50,600 మందికి ఉద్యోగాలు
- 16,466 కోట్లతో సిఫి డేటా సెంటర్
- సత్వ డెవలపర్స్ 1500 కోట్ల పెట్టుబడి



ఈ కబురు,అమరావతి: రాష్ట్ర ఆర్థిక రాజధాని విశాఖకు మరో నాలుగు ప్రతిష్టాత్మక సంస్థలు రానున్నాయి. సిఫి, సత్వా, బీవీఎం, ఏఎన్‌ఎస్‌ఆర్ సంస్థలు విశాఖలో రూ. 20,216 కోట్ల పెట్టుబడులతో, 50,600 ఉద్యోగాల కల్పన ప్రతిపాదనలతో ముందుకు వచ్చాయి. డిజిటల్ ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీలో ప్రఖ్యాత సంస్థ సిఫి 16,466 కోట్లతో డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది. సత్వ డెవలపర్స్ 1,500 కోట్లు, బీవీఎం ఎనర్జీ 1,250 కోట్లు, ఏఎన్‌ఎస్‌ఆర్ గ్లోబల్ 1,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయి. వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన బుధవారం జరిగిన తొమ్మిదో పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశం ఆ నాలుగు సంస్థల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. అలాగే ఆ సంస్థలకు పారిశ్రామిక విధానం మేరకు రాయితీపై భూములు అప్పగించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఎస్ఐపీబీలో ఆమోదించిన నిర్ణయాలను గురువారం క్యాబినెట్ ముందుంచుతారు. అది ఆమోదముద్ర వేశాక ఆ నిర్ణయాలను ప్రభుత్వం అమలు చేస్తుంది. ఇక 4 సంస్థల ప్రాధాన్యం, పెట్టుబడులతో యువతకు లభించే ఉపాధి అవకాశాలు, రాష్ట్రాభివృద్ధిలో ఈ సంస్థల భాగస్వామ్యం వంటి అంశాలను ఎస్ఐపీబీలో మంత్రి లోకేశ్ వివరించారు.

తరువాయి 2లో



## ఆగస్టు 11న ఈడీ విచారణకు రానా

తరువాయి 2లో



# 'సమితి'లో పాక్ బండారం బయటపెట్టిన భారత్

ఈ-కబురు, న్యూయార్క్: ఐక్యరాజ్యసమితిలో పాకిస్తాన్ తీరుతెన్నులను భారత్ ఎండగట్టింది. భారతదేశం వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా పరిణమిస్తుండగా, పాకిస్తాన్ ఒకవైపు మతతత్వం, మరోవైపు ఉగ్రవాదంలో ఐక్యరాజ్యసమితిలో పాకిస్తాన్ తీరుతెన్నులను భారత్ ఎండగట్టింది.

తరువాయి 3లో

## కేటీఆర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న రవీందర్ యాదవ్



తరువాయి 3లో

# యువతకు ఉపాధి కల్పనే ప్రభుత్వ సంకల్పం

- పెట్టుబడులతో వచ్చే పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తాం
- పరిశ్రమలు వెళ్లిపోతున్నాయనేది బీజేపీ, బీఆర్ఎస్ దుష్ప్రచారం

ఈ కబురు, హైదరాబాద్: తెలంగాణకు కొత్త పరిశ్రమలు వచ్చి, స్థానిక యువతకు ఉపాధి దక్కాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. తెలంగాణ పురోగతిలో భాగస్వాములయ్యే పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. పెట్టుబడులతో రాష్ట్రానికి వచ్చే పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తామని, నిబంధనల పేరిట ఇబ్బంది పెట్టమని స్పష్టం చేశారు. సీఐఐ, ఫిక్కీ, ఎఫ్‌టీసీసీఐ, ఎలీప్, టిఫ్, టాప్మా, టీఎస్‌టీఎంఏ తదితర పారిశ్రామిక సంఘాల ప్రతినిధులతో సచివాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు ఈ మేరకు మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రతి పరిశ్రమను కాపాడుకుంటామని, ముఖ్యంగా ఎంఎస్ఎంఈ రంగానికి అండగా ఉంటామని పునరుద్ఘాటించారు.



తరువాయి 2లో



# ఉచిత ప్రయాణంతో లాభాల్లోకి ఆర్టీసీ

- ఇప్పటివరకు 200 కోట్ల మంది మహిళల ఉచిత ప్రయాణం
- ఆర్టీసీకి రూ.6,680 కోట్లు చెల్లించిన ప్రభుత్వం
- మహిళా సంఘాల నిర్వహణలో 150 బస్సులు
- డిప్యూటీ సీఎం భట్టి, రవాణా మంత్రి పొన్నం వెల్లడి

తరువాయి 2లో

# ఉప రాష్ట్రపతి రేసు.. ఎవరిది అంతిమ విజయం?

» ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ రాజీనామాతో రాజకీయ వేడి పెరిగింది.
» నితీశ్ కుమార్‌ను బీజేపీ గేమ్‌లోకి తెచ్చే యోచనలో ఉంది.
» శశిథరూర్‌కు బీజేపీ ఉపరాష్ట్రపతి ఆఫర్ చేస్తున్నట్టుగా ఊహాగానాలు.
» మనోజ్ సిన్హా, వీకే సక్సేనా, హరివంశ్ పేర్లు బలంగా వినిపిస్తున్నాయి.




ఈకబురు, శేరిలింగంపల్లి : హైటెక్ మండలం శేరిలింగంపల్లి పరిధిలోని గోపనపల్లిలో హైడ్రామా చోటుచేసుకుంది. గోపనపల్లిలోని భాగ్యనగర్ టిఎన్జీవో హౌసింగ్ సొసైటీ భూముల్లో ప్రైవేటు వ్యక్తులు రాత్రికి రాత్రే కోర్టు ఆర్డర్ పేరుతో ఫెన్సింగ్ వేయడం వివాదానికి కారణమైంది. వినాయక నగర్ హౌసింగ్ సొసైటీ పేరు మీద సుప్రీంకోర్టు తీర్పు వచ్చిందంటూ దాదాపు 40 ఎకరాల విస్తీర్ణంలో ఫెన్సింగ్ వేసి భూమి చదును పనులు చేపట్టడం వివాదాస్పదంగా మారింది. 17 ఏళ్ల క్రితం ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం తమకు కేటాయించిన భూమిలో అకస్మాత్తుగా ప్రైవేటు వ్యక్తులకు ఏ విధంగా హక్కులు వచ్చాయంటూ టిఎన్జీవో సభ్యులు


తరువాయి 2లో

## రేషన్ కార్డులకూ సభలు పెట్టి గప్పాలు: కేటీఆర్



తరువాయి 2లో

## శ్రీశైలం ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తివేత



తరువాయి 2లో

మొదటి పేజీ తరువాయి

# 42 శాతం బీసీ రిజర్వేషన్లు సాధిస్తాంభట్టి



బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతోనే తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనే కృతనిశ్చయంతో తమ ప్రభుత్వం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. హైకోర్టు సైతం 90 రోజుల్లో (సెప్టెంబరు నెలాఖరులోగా) ఎన్నికలు నిర్వహించాలని, 30 రోజుల్లో (జూలై నెలాఖరులోగా) రిజర్వేషన్లు ఖరారు చేయాలని ఆదేశించిందని గుర్తు చేశారు. బీసీలకు విద్య, ఉపాధి రంగాల్లో రిజర్వేషన్లు, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించి తెలంగాణ శాసనసభ పూర్తిస్థాయిలో చర్చించి ఆమోదించిన రెండు బిల్లులను ఆమోదించడంలో కేంద్ర ప్రభుత్వం తాత్సారం చేస్తోందని మండిపడ్డారు. ఈ రెండు బిల్లుల ఆమోదానికి కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు లోక్‌సభ విపక్ష నేత రాహుల్‌గాంధీ, రాజ్యసభ విపక్ష నేత మల్లికార్జున్ ఖర్గేలను గురువారం కలవనున్నట్లు సీఎం చెప్పారు. సాయంత్రం కాంగ్రెస్ ఎంపీలకు ఈ అంశాన్ని వివరిస్తామన్నారు.బీసీల రిజర్వేషన్లను అడ్డుకునేందుకు కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, సంజయ్.. ముస్లింలను సాకుగా చూపుతున్నారని సీఎం రేవంత్ ఆరోపించారు. ప్రధాని మోదీ సొంత రాష్ట్రం గుజరాత్, ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న ఉత్తరప్రదేశ్, ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యాలయం ఉన్న మహారాష్ట్రలో ముస్లింలకు రిజర్వేషన్లు అమలవుతున్నాయని తెలిపారు. బీజేపీ నేతలకు దమ్ముంటే ఆ రాష్ట్రాల్లో ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని ప్రకటించాలన్నారు. గుజరాత్‌లో ముస్లింలకు రిజర్వేషన్లు అమలవుతున్నాయని, ఇకపై కూడా అమలు చేస్తామని అమిత్ షా ఒక ఇంటర్వ్యూలో చెప్పిన విషయాన్ని రేవంత్ ప్రస్తావించారు. ఇందుకు బీజేపీ నేతలు ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తారా? అని ప్రశ్నించారు. తెలంగాణలో తాము చేపట్టిన కుల సర్వేలో 56.4 శాతం బీసీలు ఉన్నట్లు తేలిందని, 17.45 శాతం ఎస్సీలు, 10.08 శాతం ఎస్టీలు, 10.09 శాతం అగ్రవర్గాలవారు ఉన్నట్లు వెల్లడైందన్నారు. కాగా, 3.09 శాతం మంది తాము ఏ కులానికీ చెందినవాళ్లం కాదని చెప్పారని, ఇదో కొత్త పరిణామమని అన్నారు.

ఓబీసీ రిజర్వేషన్లకు లోక్‌సభ ఎన్నికలు లిట్మస్ టెస్ట్

కులగణన విషయంలో తెలంగాణ ప్రభుత్వం దేశానికి రోల్‌మోడల్‌గా నిలిచిందని సీఎం రేవంత్ అన్నారు. కులగణన చేపట్టబోమని సుప్రీంకోర్టుకు అఫిడవిట్ సమర్పించిన కేంద్ర ప్రభుత్వం.. తెలంగాణలో తాము కులగణన చేపట్టాక తమను అనుసరిస్తూ గెజిట్ విడుదల చేసిందని పేర్కొన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికలు ఓబీసీ రిజర్వేషన్లకు లిట్మస్ టెస్టుగా నిలుస్తాయన్నారు. ఈడబ్ల్యూఎస్‌కు 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వడంతోనే 50 శాతం రిజర్వేషన్ల పరిమితి అంశం పక్కకు పోయిందన్నారు. అలాగే, స్థానిక సంస్థల్లో ఇద్దరు పిల్లల నిబంధనను ఎత్తివేసే విషయాన్ని తీవ్రంగా పరిశీలిస్తున్నామని మరో ప్రశ్నకు సమాధానంగా సీఎం చెప్పారు. ఇక తెలంగాణ రాష్ట్రంలో ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌కు నాయకుడు లేడని రేవంత్ అన్నారు. కేసీఆర్ ఇంట్లోనే కోతుల కొట్లాట ఉందని వ్యాఖ్యానించారు. కుల పెద్దనో, కుటుంబంలోని వ్యక్తో కూర్చుని మాట్లాడితే వారి సమస్య పరిష్కారమవుతుందని, కానీ.. ఇంట్లో పంచాయితీ కేవలం ప్రజల్ని తప్పుదోవ పట్టించేందుకేనని అన్నారు. 2008లో హరీశ్‌రావు ఆనాటి సీఎం రాజశేఖర్‌రెడ్డిని కలిశారని, తర్వాత కులపెద్దలతో చర్చల్లో అంతా సవ్యంగా మారిందని గుర్తు చేశారు. ఆర్డినెన్స్‌ను గవర్నర్ తిప్పిపంపారన్న బీఆర్‌ఎస్ నేతల విమర్శలను రేవంత్‌రెడ్డి ఖండించారు. 'వాళ్లు పిచ్చోళ్లు.. వాళ్లకు ఏ అవగాహన లేదని చెప్పడానికి ఇది సరిపోదా?' అని వ్యాఖ్యానించారు. ఏ బిల్లును రాష్ట్రపతి, గవర్నర్‌కు పంపినా క్లారిఫికేషన్ కోరతారని, ఇది సర్వసాధారణమని అన్నారు. ఈ విషయంలో గవర్నర్ ఆఫీసు అడిగితే వెంటనే సమాధానం ఇచ్చామని తెలిపారు.ఉపరాష్ట్రపతి పదవిని తెలంగాణ నేత బండారు దత్తాత్రేయకు ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. జగదీప్ ధన్ ఖడ్ ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేయడం దురదృష్టకర పరిణామమన్నారు. గతంలో ఏపీకి చెందిన వెంకయ్యనాయుడుకు ఉపరాష్ట్రపతి పదవి లభించిందని, ఇప్పుడు తెలంగాణకు చెందిన నేతను ఆ పదవిలో నియమించాలని అన్నారు. బీజేపీలో బీసీలకు అన్యాయం చేస్తున్నారని రేవంత్ ఆరోపించారు. బీసీ వర్గానికి చెందిన దత్తాత్రేయను గవర్నర్ పదవి నుంచి తొలగించారని, బీసీ అయిన బండి సంజయ్‌ను రాష్ట్ర బీజేపీ అధ్యక్ష పదవి నుంచి తొలగించి.. రాంచందర్‌రావుకు కట్టబెట్టారని విమర్శించారు. తమ ప్రాంత నాయకుల తలల్ని ఎన్డీఏ ప్రభుత్వం పూర్తిగా కోసేసిందని వ్యాఖ్యానించారు. అక్కడి నుంచి అసలు నాయకత్వమే లేకుండా చేయడమనే కుట్ర దీని వెనుక ఉందని ఆరోపించారు. దత్తాత్రేయకు ఉపరాష్ట్రపతి పదవి ఇవ్వడం ద్వారా తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడాలని కోరారు. అయితే తాను ఈ డిమాండ్‌ను తెలంగాణ ప్రజల తరఫున చేస్తున్నానని, ఇండియా కూటమి తరఫున కాదనితెలిపారు. అది ఏఐసీసీ స్థాయిలో తీసుకోవాల్సిన నిర్ణయమన్నారు. ఈ విషయంపై కాంగ్రెస్ నాయకత్వంతో తెలంగాణ పక్షాన మాట్లాడతానన్నారు. దత్తాత్రేయ పేరు మోదీ ప్రకటిస్తే తాను ఇండియా కూటమి నేతలతో కూడా మాట్లాడతానని చెప్పారు. దత్తాత్రేయకు పదవి ఇస్తే తెలంగాణలో బీసీలకు న్యాయం జరిగినట్లు కూడా అవుతుందని అన్నారు. మోదీ బీసీ కాదని, కన్వర్టెడ్ బీసీ అని రేవంత్ వ్యాఖ్యానించారు.

మొదటి పేజీ తరువాయి

# ఉప రాష్ట్రపతి రేసు.. ఎవరిది అంతిమ విజయం?




ఈకబురు, ఢిల్లీ: ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అనూహ్యంగా తన పదవికి రాజీనామా చేయడం దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసింది. అనారోగ్య కారణాలతో పదవిని విడిచిపెడుతున్నట్టు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాసిన ఆయన రాజీనామాను రాష్ట్రపతి ఆమోదించారు. ఈ పరిణామంతో దేశంలో రెండో అత్యున్నత రాజ్యాంగ పదవి ఖాళీ కావడంతో, కొత్త ఉపరాష్ట్రపతిగా ఎవరు బాధ్యతలు చేపట్టబోతున్నారన్న ఉత్కంఠ పెరిగింది.

రాజకీయ రంగంలో పేర్లు చక్కర్లు

తదుపరి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా పలు ప్రముఖుల పేర్లు చక్కర్లు కొడుతున్నాయి. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా, రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ వంటి నేతల పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. అదే సమయంలో కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ పేరు కూడా తెరపైకి రావడం ఆసక్తికరంగా మారింది.

ధన్‌ఖడ్ రాజీనామా... బీజేపీ వ్యూహమా?

ఈ పరిణామాన్ని బీహార్ ప్రతిపక్షం ఆర్జేడీ తీవ్రంగా విమర్శించింది. ఉపరాష్ట్రపతి పదవిని నితీశ్‌కు ఇచ్చి, రాష్ట్రంలో బీజేపీకి అనుకూల సీఎంను కూర్చోబెట్టే పన్నాగం ఇది అని ఆ పార్టీ ఆరోపించింది. బీహార్ అసెంబ్లీకి త్వరలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో ఇది రాజకీయ కుట్ర అని ఆర్జేడీ నేతలు తీవ్రంగా అభిప్రాయపడ్డారు. గతంలోనూ నితీశ్ ఉపరాష్ట్రపతిగా మారనున్నారన్న ఊహాగానాలు ఉండడం గమనార్హం.

**థరూర్‌కు బీజేపీ ఆఫర్?**

ఇటీవలి కాలంలో కేంద్రంపై అనుకూల వ్యాఖ్యలు చేస్తున్న శశిథరూర్, కాంగ్రెస్‌కు క్రమంగా దూరమవుతున్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కేంద్రం నియమించిన ఆపరేషన్ సిందూర్ కమిటీకి ఆయన నాయకత్వం వహించడం చర్చనీయాంశంగా మారింది. దీంతో, బీజేపీలోకి ఆహ్వానించి ఉపరాష్ట్రపతి పదవిని అందించబోతున్నారన్న ఊహాగానాలు ఊపందుకున్నాయి.

**లెఫ్టినెంట్ గవర్నర్లకు అవకాశమా?**

మనోజ్ సిన్హా: జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా పదవీకాలం 2025 ఆగస్టులో ముగియనుంది. ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూకశ్మీర్‌లో శాంతి పరిరక్షణలో ఆయన ముద్ర ఉండగా, ఇటీవల పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో కొంత విమర్శ ఎదురైంది.

వీకే సక్సేనా: ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా, ఆప్ ప్రభుత్వంతో పదేపదే ఘర్షణలకు దిగుతూ వార్తల్లో నిలిచారు. నియామకాలు, పాలనా నిర్ణయాల్లో ఆయన ఆప్ ప్రభుత్వానికి పెద్ద సవాళ్లుగా నిలిచారు. పరిపాలనా అనుభవంతో పాటు, ఆయన పాత్రను కేంద్రం గమనిస్తున్నట్టు తెలుస్తోంది.

**నితీశ్ కుమార్ – ఊహించని దిశలో ప్రయాణమా?**

బీహార్ సీఎం నితీశ్ కుమార్ (74) పేరు కూడా వినిపిస్తుండడం రాజకీయ విశ్లేషకులకు ఆశ్చర్యం కలిగిస్తోంది. జేడీయూ నేత ఉపేంద్ర కుశ్వాహా వంటి వారు నితీశ్ ముఖ్యమంత్రి పదవిని యువతరంకు అప్పగించాలని సూచించగా, కేంద్ర మంత్రి చిరాగ్ పస్వాన్ బీహార్ ఎన్నికల్లో పోటీకి సిద్ధమయ్యారు. బీహార్‌కు రాజకీయంగా కీలకమైన సమయమిది.

**హరివంశ్ నారాయణ్ కూడా రేసులో**

రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్, జేడీయూ నుంచి వచ్చిన నేతగా బీజేపీ మద్దతుతో పదవిలో ఉన్నారు. నిశ్శబ్దంగా విధులను నిర్వహిస్తున్న ఆయనకు ఆ పార్టీ మద్దతుతో ఉపరాష్ట్రపతి అవకాశాలు ఉండొచ్చన్న ప్రచారం జరుగుతోంది.

**ప్రతిపక్ష వ్యూహం ఏంటి?**

గత ఎన్నికల్లో మార్గరెట్ అల్వా, గోపాల్ గాంధీ లాంటి నాయకులను రంగంలోకి దించిన ప్రతిపక్షం, ఈసారి ఐక్యత సాధించగలదా? ఉపరాష్ట్రపతి ఎన్నికలను బీజేపీ బీహార్ ఎన్నికల సమయానికి కలిపేందుకు ప్రయత్నిస్తుందా? అనే చర్చ కూడా జరుగుతోంది.

**ముగింపు:**

ఉపరాష్ట్రపతి పదవిని భర్తీ చేసే ప్రక్రియ త్వరలో ప్రారంభం కానుండగా, ఎవరు ఖర్చుపడతారో అన్న ఉత్కంఠ చరమాంకానికి చేరుతోంది. రాజకీయంగా కీలకమైన ఈ వ్యవహారం, రాబోయే ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయి.

# విశాఖలో 20,216 కోట్ల పెట్టుబడులు



ముఖ్యమంత్రి మాట్లాడుతూ, భవిష్యత్తులో పెట్టుబడుల అవసరాలకు తగ్గట్టుగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. విశాఖలో భూమి లభ్యత తక్కువగా ఉందని చెప్పారు. ఇప్పటికే ఆర్సెల్లార్ మిట్టల్‌కు భూములు ఇస్తున్నామని గుర్తు చేశారు. ఈ క్రమంలో విశాఖకు తరలివచ్చే పారిశ్రామిక సంస్థలకు మౌలిక సదుపాయాల సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సీఎం చెప్పారు. బెంగళూరు వంటి పట్టణాల్లో ట్రాఫిక్ సమస్య ఇబ్బందిగా మారిందన్నారు. మౌలిక సదుపాయాల కల్పన కూడా కష్టమవుతోందన్నారు. అందుకే విమానాశ్రయం, రైలు కనెక్టివిటీ, హైవే రోడ్లు, మెట్రో వంటి వాటిపై ముందస్తు ప్రణాళికలు ఉండాలని, దీనికి తగ్గట్లు కార్యాచరణ ప్రణాళికలపై ఫోకస్ పెట్టాలని అధికారులకు సూచించారు. దీనివల్ల ముందు పౌరజీవనంలో ఎలాంటి సమస్యలూ తలెత్తవని సీఎం పేర్కొన్నారు. పారిశ్రామిక, ఇన్ఫర్మేషన్ కంపెనీలకు సమీపంలో ఉద్యోగులు నివాసం ఉండేలా మౌలిక సదుపాయాలను కల్పిస్తే ట్రాఫిక్ సమస్యనూ తగ్గించవచ్చన్నారు. విద్యాసంస్థలు, మాల్స్ వంటివి జనావాసాల సమీపంలోనే ఉంటే ఆర్థిక భారంలేని నగర జీవనం అందుబాటులో ఉంటుందన్నారు.

మొదటి పేజీ తరువాయి

# ఉచిత ప్రయాణంతో లాభాల్లోకి ఆర్టీసీ

ఈ కబురు హైదరాబాద్: గత పదేళ్లుగా పీకల్లోతు నష్టాల్లో కూరుకుపోయిన ఆర్టీసీ ఇప్పుడు లాభాల బాటలో పరుగులు తీస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆర్టీసీ లాభాల్లోకి వచ్చిందన్నారు. మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టినప్పటి నుంచి ఇప్పటివరకు 200 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని, రూ.6,680 కోట్ల ప్రయాణ చార్జీలను ఆదా చేసుకున్నారని తెలిపారు. 200 కోట్ల ఉచిత ప్రయాణాలు పూర్తయిన సందర్భంగా మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లో ఘనంగా విజయోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన భట్టి మాట్లాడుతూ, 200 కోట్ల ప్రయాణాలు పూర్తి కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీలో పండుగ వాతావరణం నెలకొందన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 2023 డిసెంబర్ 9న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించిన సంగతి గుర్తు చేశారు. ఆయా చార్జీల కింద ఆర్టీసీకి ప్రభుత్వం ఇప్పటివరకు రూ.6,680 కోట్లు చెల్లించిందని చెప్పారు. మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టడానికి ముందు టీఎస్‌ఆర్టీసీ బస్సుల్లో ప్రతీరోజు 45 లక్షల మంది ప్రయాణం చేస్తే ఇప్పుడు 65 లక్షల మంది ప్రయాణం చేస్తున్నారన్నారు.

ఆక్యుపెన్సీ రేషియో 62 శాతం నుంచి 97కు చేరిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు మహిళా సంఘాలు సొంతంగా బస్సులను కొనుగోలు చేసి అద్దె ప్రాతిపదికన ఆర్టీసీలో నడిపే విధంగా ప్రోత్సహిస్తున్నట్లు భట్టి తెలిపారు. ఇలా ఇప్పటివరకు 150 బస్సులకు రూ.కోటి చెల్లించినట్లు చెప్పారు.

**ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్ల కృషి వల్లనే..**

ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్ల కృషి వల్లనే 200 కోట్ల ఉచిత ప్రయాణాలు సాధించగలిగామని మంత్రి పొన్నం చెప్పారు. మహిళలు తమ దైనందిన ప్రయాణ అవసరాలకు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకుంటున్నారని చెప్పారు. బస్సులకు మహిళలను యజమానులను చేయడమే కాకుండా ప్రభుత్వం పెట్రోల్ బంకులను కూడా మహిళలకు కేటాయించినట్లు మంత్రి కోమటిరెడ్డి చెప్పారు. ప్రతి గ్రామం నుంచి మండలానికి, జిల్లా కేంద్రానికి కొత్తగా డబుల్ రోడ్ల నిర్మాణం వచ్చే నెలలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్, హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన తదితరులు పాల్గొన్నారు.





# ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో ట్విస్ట్



ఈ కబురు: హైదరాబాద్: తెలంగాణ రాజకీయ ప్రకంపనలు రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో ట్విస్ట్ చోటుచేసుకుంది. ఎస్ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్ రావు.. సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సిట్ విచారణ పేరుతో తమను వేధిస్తున్నారంటూ ఆయన పిటిషన్ దాఖలు చేశారు. తరచూ పోలీస్ స్టేషన్‌కు పిలిచి వేధిస్తున్నారని ప్రభాకర్‌రావు పిటిషన్ దాఖలు చేయగా.. మరో వైపు ప్రభాకర్‌రావుకు ఇచ్చిన రిలీఫ్‌ను కొట్టివేయాలంటూ పోలీసులు కోరారు. ప్రభాకర్‌రావు పిటిషన్.. ఆగస్టు 4వ తేదీన విచారణకు రానుంది.కాగా, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు ల్యాప్‌టాప్, ఫోన్‌ను సిట్ అధికారులు సీజ్ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పటికే నిందితులు, బాధితుల స్టేట్మెంట్ ఆధారంగా సిట్ అధికారులు ప్రభాకర్ రావును విచారిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో 2023 నవంబర్ 15 నుంచి 30 మధ్యే ప్రభాకర్‌రావు నేతృత్వంలోని ఎస్ఐబీ 4,013 ఫోన్లపై నిఘా ఉంచినట్లు సిట్ గుర్తించిన సంగతి తెలిసిందే.వీటిలో 618 రాజకీయ నాయకులకు సంబంధించినవిగా తేల్చింది. మరోపక్క కేసులో మరో నిందితుడు ప్రణీత్‌రావు ఫోన్ నుంచి సిట్ అధికారులు కొన్ని ఆడియోలు సేకరించారు. వాస్తవానికి రాష్ట్రంలో ప్రభుత్వం మారిన వెంటనే ప్రభాకర్‌రావుతో పాటు ఆయన టీమ్ మొత్తం తమ ఫోన్లలో ఉన్న డేటాను డిలీట్ చేయడంతో పాటు ఫోన్లను ధ్వంసం చేసింది. అయితే ప్రణీత్‌కు సంబంధించిన ఓ ఫోన్‌లో మాత్రం డేటా డిలీట్ కాకపోవడంతో అది సిట్ చేతికి చిక్కింది.

# శ్రీశైలం ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తివేత



ఈ కబురు: జూరాల, సుంకేశుల నుంచి శ్రీశైలం వస్తున్న నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టినా...ప్రస్తుత వర్షాలతో వాటర్ క్యాచ్‌మెంట్ ఏర్పడటంతో శ్రీశైలం ప్రాజెక్టు మరో గేట్‌ను ఎత్తారు. జూరాల నుంచి 39,746, సుంకేశుల నుంచి 36,975 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. శ్రీశైలం ప్రాజెక్టు 2 గేట్లు ఎత్తి స్పిల్‌వే ద్వారా 54,956 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 883.7 అడుగుల నీటి మట్టం వద్ద 208.2841 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

నాగార్జునసాగర్‌కు పెరిగిన వరద: ఎగువన కృష్ణానది నుంచి నాగార్జునసాగర్ జలాశయానికి వరద పెరిగింది. మొత్తంగా 1,21,967 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వస్తోంది. నాగార్జునసాగర్ గరిష్ట నీటిమట్టం 590 అడుగులు (312 టీఎంసీలు) కాగా.. బుధవారం సాయంత్రానికి 573 అడుగులకు (264 టీఎంసీలు) చేరింది.

**దుందుబి జోరు.. డిండిలోకి నీరు**

నల్లగొండ జిల్లాలోని డిండి ప్రాజెక్టులోకి ఎగువ నుంచి వరద భారీగా వస్తోంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కురుస్తున్న వర్షానికి తోడు కల్వకుర్తి లిఫ్ట్ ద్వారా వస్తున్న నీటితో దుందుబి వాగు దిగువకు పరవళ్లు తొక్కుతోంది.

**కడెం ప్రాజెక్టు గేటు ఎత్తివేత**

నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టు గేటు బుధవారం రాత్రి ఎత్తారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 700 అడుగులుగా, ప్రస్తుతం 695.100 అడుగుల మేర నీరు ఉంది.


# ఆగస్టు 11న ఈడీ విచారణకు రానా



ఈ కబురు: బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ కేసులో వచ్చేనెల 11న విచారణకు హాజరు కావాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సినీనటుడు రానాకు తాజాగా నోటీసు జారీ చేసింది. బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకుల నుంచి సినీనటులు, యూట్యూబర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లు పారితోషికం తీసుకున్న వ్యవహారంలో మనీలాండరింగ్ జరిగిందనే కోణంలో ఈడీ దర్యాప్తు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే రానాతోపాటు నటులు ప్రకాశ్‌రాజ్, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మి తదితరులకు ఈడీ నోటీసులిచ్చింది. ఇందులోభాగంగా రానా బుధవారం విచారణకు హాజరు కావాల్సి ఉంది. అయితే ముందస్తు షూటింగ్ షెడ్యూల్ కారణంగా కొంత గడువు ఇవ్వాలని రానా ఇటీవలే ఈడీకి విన్నవించారు. ఈ క్రమంలోనే ఈడీ బుధవారం తాజా నోటీసు జారీ చేసింది.

# యువతకు ఉపాధి కల్పనే ప్రభుత్వ సంకల్పం

గత ప్రభుత్వం మాదిరిగా ఏకపక్షంగా వ్యవహరించమని, పారిశ్రామికాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రానికి కొత్తగా రూ.3 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను తీసుకొచ్చామని, ప్రైవేటు రంగంలో లక్ష మందికి పైగా ఉపాధి కల్పించామని వివరించారు. రాష్ట్రం నుంచి పరిశ్రమలు తరలి వెళ్లిపోతున్నాయంటూ బీఆర్ఎస్, బీజేపీ దుష్ప్రచారం చేస్తున్నాయని తెలిపారు. పారిశ్రామికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఆయా సంఘాల ప్రతినిధులకు వివరించిన మంత్రి శ్రీధర్‌బాబు.. వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. పారిశ్రామికవేత్తలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కారించాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ కనీస వేతనాల సలహా బోర్డు అధ్యక్షుడు బీ జనక్ ప్రసాద్, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



# రేషన్ కార్డులకూ సభలు పెట్టి గప్పాలు: కేటీఆర్

ఈ కబురు,హైదరాబాద్: చీకటి చూస్తేనే వెలుగు విలువ తెలుస్తుందని, కాంగ్రెస్ అసమర్థ పాలనను చూశాక.. రాష్ట్రంలో గుర్రాలెవరో.. గాడిదలెవరో.. ప్రజలకు తెలిసిపోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. మీ సేవా కేంద్రాల్లో ఇచ్చేసే రేషన్‌కార్డుల గురించి పెద్ద పెద్ద సభలుపెట్టి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గప్పాలు కొడుతున్నాడని విమర్శించారు. ఆడబిడ్డలకు రూ.300కోట్ల మేర వడ్డీలేని రుణాలిచ్చి ఘనకార్యంలాగా కాంగ్రెస్ సంబరాలు చేసుకుంటోందని, కేసీఆర్ హయాంలో రూ.3000 కోట్ల దాకా వడ్డీలేని రుణాలిచ్చినా.. గొప్పగా చెప్పుకోలేదన్నారు.తెలంగాణ భవన్‌లో బుధవారం వికారాబాద్, సిర్పూర్ నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు పలువురు బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీల పేరిట అడ్డగోలు హామీల్చి అధికారం చేపట్టిన కాంగ్రెస్.. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. కొందరు పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తలా పని చేస్తున్నారని విమర్శించారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలవడం ఖాయమని, అప్పుడు అధికారులందరూ సెట్ రైట్ అవుతారని, పార్టీ శ్రేణులను వేధించే పరిస్థితి ఉండదని అన్నారు.



మొదటి పేజీ తరువాయి

# జర్నలిజంలో విప్లవాత్మక మార్పులు

## మీడియా అకాడమి చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి



సమావేశంలో ప్రసంగిస్తున్న మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి

### మీడియా అకాడమీలో జర్నలిస్టుల శిక్షణా తరగతులు ప్రారంభం

ఈకబురు, శేరిలింగంపల్లి : జర్నలిజంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయని, రోజురోజుకు శరవేగంగా మారుతున్న టెక్నాలజీ వార్తల సేకరణను సులభతరం చేస్తుందని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమీ భవనంలో రంగారెడ్డి జిల్లా ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల రెండు రోజుల శిక్షణ తరగతుల కార్యక్రమానికి బుధవారం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్నాలజీ, సామాజిక మాధ్యమాల ప్రభావంతో వార్తల సేకరణ పూర్తిగా కొత్త రూపం దాల్చాయని తెలిపారు. ప్రస్తుత సాంకేతికత డిజిటల్ మీడియా రంగంలో తనదైన ముద్ర వేస్తుందని, వేగంగా వార్తల సేకరణ సులభం అవుతుందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా జర్నలిస్టులు తమ నైపుణ్యాలను పెంచుకోవాలని, జర్నలిస్టుల నైపుణ్యాభివృద్ధికి కావలసిన శిక్షణ ఇవ్వడానికి మీడియా అకాడమి అన్ని చర్యలను చేపడుతూ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. దరఖాస్తు చేసుకున్న జర్నలిస్టుల కు శిక్షణ ఇవ్వనున్నామని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ సంపాదకులు కే శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ జర్నలిజం గతం, వర్తమానం, భవిష్యత్తు మీడియా ధోరణులు, ఆధునిక యుగంలో మీడియాలో వస్తున్న మార్పుల గురించి వివరించారు. సోషల్ మీడియా, యూట్యూబ్ లో వస్తున్న వార్తలు క్షణాల్లో ప్రజల చెంతకు వెళ్తున్నాయని తెలిపారు. సీనియర్ జర్నలిస్ట్ ఉడుముల సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, ఫేక్ న్యూస్, సైబర్ క్రైమ్, సోషల్ మీడియా, ఫ్యాక్టు చెక్, మొదలైనవి టెక్నికల్ గా ఏ విధంగా ఉపయోగించాలో జర్నలిస్టులకు సవివరంగా తెలియజేశారు.



సమావేశానికి హాజరైన జర్నలిస్టు నాయకులు, జర్నలిస్టులు

సీనియర్ జర్నలిస్ట్ గోవింద్ రెడ్డి మాట్లాడుతూ నేర వార్తల సేకరణలో తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించడంతో పాటు చట్టాలపై అవగాహన ఉండాలని సూచించారు. వార్తలు సేకరించే ముందు నిజనిర్ధారణ చేసుకొని వ్రాయాలని అన్నారు. సీనియర్ జర్నలిస్ట్ దిలీప్ రెడ్డి సమాచార హక్కు చట్టం 2005 గురించి సమగ్రంగా వివరించడంతో పాటు జర్నలిస్టుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మీడియా అకాడమీ కార్యదర్శి ఎన్. వెంకటేశ్వర రావు, ఐజేయూ కార్యదర్శి వై నరేందర్ రెడ్డి, నాయకులు మాజీద్ ,టీయూడబ్ల్యూజె రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు సలీమ్ పాషా, కార్యదర్శి మేకల సత్యనారాయణ, రంగారెడ్డి జిల్లా డిపిఆర్ఓ పిసి వెంకటేశం, మేనేజర్ శైలేశ్వర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా జర్నలిస్టులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# కేటీఆర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన రవీందర్ యాదవ్



కేటీఆర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న రవీందర్ యాదవ్

ఈకబురు, శేరిలింగంపల్లి : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీ. రామారావు కు శేరిలింగంపల్లి యువనేత రవీందర్ యాదవ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నందినగర్ నివాసంలో బుధవారం కేటీఆర్ ను కలిసిన రవీందర్ యాదవ్ 49వ జన్మదినం సందర్భంగా ప్రత్యేకంగా విష్ చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ దంపతుల ఫోటో ఫ్రేమ్ ను అందజేశారు. ఈ సందర్భంగా యువనేత రవీందర్ యాదవ్ మాట్లాడుతూ.. కేటీఆర్ హయాంలోనే హైదరాబాద్ అభివృద్ధి జరిగిందని, విశ్వనగరంగా మార్చారని కొనియాడారు. పేదల కోసం గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంతో అండగా నిలిచారాని గుర్తు చేశారు. తన జన్మదినం సందర్భంగా ఖర్చులు పెట్టకుండా.. గిఫ్ట్ లు తనకు ఇవ్వొదని, అదే డబ్బులతో పేదలకు సహాయం చేయాలి అని పార్టీ నేతలకు సూచించారని తెలిపారు. తాను సైతం గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో పాల్గొని అందరికి ఆదర్శంగా నిలిచారని అన్నారు. రానుంది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని రవీందర్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు.

మొదటి పేజీ తరువాయి

# 'సమితి'లో పాక్ బండారం బయట పెట్టిన భారత్




ఐక్యరాజ్యసమితిలో పాకిస్తాన్ తీరుతెన్నులను భారత్ ఎండగట్టింది. భారతదేశం వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా పరిణమిస్తుండగా, పాకిస్తాన్ ఒకవైపు మతతత్వం, మరోవైపు ఉగ్రవాదంలో మునిగిపోయి, భారీ రుణగ్రహీతగా మారిందని ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత ప్రతినిధి పర్వతనేని హరీష్ పేర్కొన్నారు.

ఐక్యరాజ్యసమితిలో 'అంతర్జాతీయ శాంతి- భద్రతను ప్రోత్సహించడం' అనే అంశంపై జరిగిన ఉన్నత స్థాయి బహిరంగ చర్చలో పర్వతనేని హరీష్ మాట్లాడుతూ, భారతదేశం పరిణతి చెందిన ప్రజాస్వామ్య దేశమని, పురోగతి, శ్రేయస్సు, అభివృద్ధి నమూనాలలో ఎదుగుతున్నదని పేర్కొన్నారు. పొరుగుదేశం ఇందుకు భిన్నంగా ఉన్నదని ఆరోపించారు. భారత్ ఐక్యరాజ్యసమితి లక్ష్యంలో భాగస్వామ్యం వహిస్తూ, మరింత శాంతియుత, సంపన్నమైన,ప్రపంచం కోసం సమిష్టిగా కృషి చేయడంలో చురుకుగా, నిర్మాణాత్మకంగా పాల్గొంటున్నదని అన్నారు.

vభారతదేశం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలతో పోటీ పడుతుండగా, అదే సమయంలో పాకిస్తాన్ అంతర్జాతీయ వేదికల నుండి రుణాలు తీసుకోవడంలో బిజీగా ఉందని హరీష్ ఎద్దేవా చేశారు. పాకిస్తాన్ అంతర్జాతీయ సమాజానికి ఆమోదయోగ్యం కాని పద్ధతులకు పాల్పడుతున్నదని ఆయన అన్నారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ దాడిని గుర్తు చేస్తూ, ఈ ఘటనలో పాకిస్తాన్ ఉగ్రవాదులు 26 మంది అమాయక పౌరులను కాల్చి చంపారని హరీష్ పేర్కొన్నారు. అనంతరం భారత్ 'ఆపరేషన్ సిందూర్'ను ప్రారంభించి పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలను తునాతునకలు చేసిందన్నారు.

# ఐటీ కారిడార్ లో పర్యటించిన

## హైడ్రా, జీహెచ్ఎంసీ కమిషనర్లు



ఐటీ కారిడార్ లో వరద ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న హైడ్రా, జిహెచ్ఎంసి కమిషనర్లు



ఐటీ కారిడార్ లో వరద ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న హైడ్రా, జిహెచ్ఎంసి కమిషనర్లు


### వరద నీరు నిలిచిన ప్రాంతాల పరిశీలన..

ఈకబురు, శేరిలింగంపల్లి :గచ్చిబౌలి, మాదాపూర్ ఐటీ కారిడార్ పరిధిలో బుధవారం హైడ్రా, జిహెచ్ఎంసి కమిషనర్లు సుడిగాలి పర్యటన చేపట్టారు. గత రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షం కారణంగా ఐటీ కారిడార్ పరిధిలోని పలు ప్రాంతాల్లో వరద నీరు నిలిచిపోయి ఇబ్బందులు ఏర్పడగా, బుధవారం ఇరువురు కమిషనర్లు స్థానికంగా పర్యటించి వరదనీటి లాగింగ్ పాయింట్లను పరిశీలించారు. హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, సైబరాబాద్ జాయింట్ కమిషనర్ గజారావుభూపాల్‌లు వివిధ విభాగాల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరుద కాలువల్లో సిల్ట్ తొలగించే పనులను పరిశీలించడంతో పాటు ఆర్‌యూబీలు నీట మునగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులకు వివరించారు. కొత్తగూడ చౌరస్తాలో వరద నీరు నిలిచిన ఆర్ యూబీని జీహెచ్ఎంసీ అధికారులతో పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆటోమేటిక్ డీ వాటరింగ్ పంపులు పని చేయకపోవడంతో ఆర్‌యూబీ నీట మునిగిందని అధికారులు హైడ్రా కమిషనర్‌కు తెలియజేశారు. పంపుల మరమ్మతులు చేయడంతో ప్రస్తుతం ఇబ్బంది లేదని అధికారులు చెప్పారు. ఆర్‌యూబీ వద్ద హైడ్రా పంపులు సైతం అందుబాటులో ఉంచి సమస్య పునరావృతం కాకుండా చూడాలని అధికారులను హైడ్రా కమిషనర్ ఆదేశించారు. వరద ముప్పు ప్రాంతాల్లో నిరంతరం సేవలందించే స్టాటిక్ టీమ్ లు ట్రాఫిక్ పోలీసులకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ గజరావు భూపాల్, అధికారులతో కలిసి బయోడైవర్సిటీ జంక్షన్ లో పర్యటించారు. రెండు రోజుల క్రితం కురిసిన వర్షం కారణంగా ప్రిస్టిన్ మాల్ ముందు వరద నీరు నిలిచిపోయి ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడిన విషయం తెలిసిందే. వరద నీరు నిలిచిపోవడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఫ్లై ఓవర్ల మీద వర్షపునీరు కిందకు జారే రంధ్రాల్లో మట్టి చేరకుండా జాగ్రత్త పడాలని కమిషనర్లు సూచించారు. అనంతరం గచ్చిబౌలి గమన్ ఆసుపత్రి వద్ద నీరు నిలిచిన ప్రాంతాలను పరిశీలించారు. గచ్చిబౌలి ఐటీ కారిడార్ నుంచి వచ్చిన వరద నీరు గమన్ ఆసుపత్రి సమీప ప్రాంతాలను ముంచేత్తుతున్నాయని, గతంలో ఇక్కడ ఉన్న నాలా కబ్జాకు గురి కావడంతో సమస్య ఏర్పడిందని స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన హైడ్రా కమిషనర్ వెంటనే నాలాను పునరుద్ధరించాలని ఆదేశించారు. వర్షాకాలంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని.. వర్షం పడినప్పుడు వరదతో పాటు వచ్చే సిల్ట్ నుఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. వర్షాలు పడిన సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హైడ్రా, జిహెచ్ఎంసి, ట్రాఫిక్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# పార్లమెంట్‌లో 'ఆపరేషన్ సిందూర్'పై చర్చకు డేట్ ఫిక్స్

ఈకబురు, దిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను కుదిపేస్తున్న పహల్గాం ఉగ్రదాడి, 'ఆపరేషన్ సిందూర్' అంశాలపై చర్చకు గ్రీన్ సిగ్నల్ పడింది. జులై 29న ఉభయసభల్లో దీనిపై సుదీర్ఘంగా చర్చ జరపనున్నట్లు తెలుస్తోంది. లోక్‌సభలో 16 గంటలు, రాజ్యసభలో 9 గంటల పాటు దీనిపై ఎంపీలు మాట్లాడనున్నట్లు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. బుధవారం జరిగిన పార్లమెంట్ బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.



ఈ ఏడాది ఏప్రిల్‌లో జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన సంగతి తెలిసిందే. దీనికి ప్రతీకారంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. పాకిస్థాన్, పీఓకేలోని ఉగ్ర శిబిరాలే లక్ష్యంగా మెరుపుదాడులు చేసింది. అత్యంత కచ్చితత్వంలో కీలక ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసింది. దీనికి ప్రతిగా పాకిస్థాన్ కూడా భారత్ పైకి డ్రోన్లు, క్షిపణలు పంపించింది. దీంతో ఇరుదేశాల మధ్య కొన్ని రోజుల పాటు భీకర ఘర్షణ వాతావరణం నెలకొంది.రాజీనామాకు ముందు.. ముందస్తు షెడ్యూల్ లేకుండా రాష్ట్రపతి భవన్‌కు ధన్‌ఖడ్!

అనంతరం పాక్ అభ్యర్థన మేరకు భారత్ కాల్పుల విరమణకు అంగీకరించింది. అయితే, ఈ రెండు దేశాల మధ్య యుద్ధాన్ని తానే ముగించానంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదే పదే ప్రకటించుకుంటున్నారు. దీంతో అగ్రరాజ్య ఆరోపణలపై పార్లమెంట్ సమావేశాల్లో చర్చ జరపాలని కాంగ్రెస్ సహా విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ట్రంప్ వ్యాఖ్యలు, పహల్గాం దాడి వెనక నిఘా వైఫల్యం వంటి ఆరోపణలపై భారత ప్రధాని నరేంద్ర మోదీ సమాధానం చెప్పాలని పట్టుబడుతున్నాయి. విపక్షాల నిరసనలతో పార్లమెంట్ కార్యకలాపాలకు అంతరాయం కలుగుతోంది. ఈనేపథ్యంలో దీనిపై చర్చకు తాజాగా తేదీని నిర్ణయించారు.ప్రస్తుతం ప్రధాని మోదీ విదేశీ పర్యటనకు వెళ్లారు. మాల్దీవులు, యూకే పర్యటన ముగించుకొని జులై 26న స్వదేశానికి తిరిగొస్తున్నారు. దీంతో జులై 29న లోక్‌సభలో జరిగే చర్చలో ప్రధాని పాల్గొనే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

# గచ్చిబౌలిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య




ఆత్మహత్య చేసుకున్న యామిని (ఫైల్)

ఈకబురు, శేరిలింగంపల్లి : సొంత గ్రామానికి వెళ్లేందుకు బయలుదేరి, అనారోగ్యంతో మార్గమధ్యలో నుంచి అర్ధాంతరంగా తాను నివాసం ఉంటున్న హాస్టల్ గదికి తిరిగి వచ్చిన సాఫ్టవేర్ ఉద్యోగిని ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి త్వరలో పెళ్లి చేయడం కోసం కుటుంబ సభ్యులు పెళ్లి సంబంధాలు చూస్తున్న క్రమంలోనే ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర విషాదాన్ని నింపింది. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం...

ఖమ్మం పట్టణంలోని గాంధీనగర్ కు చెందిన చింతల యామిని (27) గచ్చిబౌలి ఇందిరానగర్ లోని జెకె పీజీ హాస్టల్ లో నివాసం ఉంటూ ఓ కంపెనీలో సాఫ్టవేర్ ఇంజనీర్ గా పని చేస్తోంది. మంగళవారం ఉదయం ఖమ్మం వెళ్లేందుకు హాస్టల్ నుంచి బయలుదేరి కాచిగూడ రైల్వే స్టేషన్ కు వెళ్లింది. స్టేషన్ వద్ద తనకు వాంతులు అయ్యాయని చెప్పి ఉదయం 8.30 గంటలకు తిరిగి హాస్టల్ కు వచ్చింది. తనతో పాటు గదిలో ఉండే నిఖిత, రాణిలతో కలిసి టిఫిన్ చేసిన యామిని ఆరోగ్యం బాగాలేదని. హాస్టల్ గదిలోనే ఉండిపోయింది. స్నేహితులు సాయంత్రం 5 గంటలకు తిరిగి రాగా గది లోపల నుంచి గడియ పెట్టి ఉంది. డోర్ కొట్టినా, ఫోన్ చేసినా స్పందించకపోవడంతో వారు హాస్టల్ నిర్వాహకులకు సమాచారం అందించారు. దీంతో గది కిటికీ అద్దాలు పగులగొట్టి చూడగా కిటికీ గ్రిల్ కు చున్నీతో ఉరి వేసుకొని యామిని ఆత్మహత్య చేసుకుని కనిపించింది. నిర్వాహకులు వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. యామినికి పెళ్లి చేయడం కోసం కుటుంబ సభ్యులు ఈ మధ్యే పెళ్లిసంబంధాలు చూస్తుండగా, యామిని ఆత్మహత్య కు పాల్పడడం విషాదాన్ని నింపింది. ఇప్పటి వరకు ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని పోలీసులు చెప్పగా, యామిని కాల్ డేటాను పరిశీలిస్తున్నారు. బుధవారం పోస్టు మార్టం అనంతరం మృతదేహన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కంచ గచ్చిబౌలి కేసు.. సుప్రీం కోర్టు మరో వార్నింగ్

ఈకబురు, వివాదాస్పద హెచ్‌సీయూ కంచ గచ్చిబౌలి కేసు విచారణలో భాగంగా.. అధికారులకు సుప్రీం కోర్టు మరోసారి హెచ్చరికలు జారీ చేసింది. అక్కడికక్కడే తాత్కాలిక జైళ్లను ఏర్పాటు చేసి అందులోకి అధికారులు పంపాల్సి ఉంటుందని భారత ప్రధాని న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ బుధవారం హెచ్చరించారు. కంచ గచ్చిబౌలి కేసు విచారణ ఇవాళ సుప్రీం కోర్టులో జరిగింది. తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్ పరిశీలనకు సమయం కావాలని ప్రతివాదులు కోరారు. దీంతో రెండు వారాల సమయం ఇస్తూ.. తదుపరి విచారణను ఆగష్టు 13కి వాయిదా వేసింది. కోర్టు.. అయితే.. ప్రస్తుతం అడవిని కాపాడారు కదా? అని చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ తెలంగాణ ప్రభుత్వం తరపున లాయర్లను ప్రశ్నించారు. దానికి ''ప్రస్తుతానికి కంచ గచ్చిబౌలి భూముల్లో అన్ని పనులు ఆపేశాం'' అని తెలంగాణ ప్రభుత్వం తరపు న్యాయవాది బదులిచ్చారు. అభివృద్ధి కోసం అడవులను నరకడం సమంజసం కాదు. రాత్రికి రాత్రి బుల్డోజర్ పెట్టి అడవిని తీసేద్దామనుకున్నారు. సుస్థిర అభివృద్ధి కోసం నేను అడ్వొకేట్ చేస్తున్నా. అడవిని కాపాడకుంటే... అధికారులను అక్కడే టెంపరరీ జైలుకు పంపుతాం అని హెచ్చరించారాయన.






# త్వరలో అంతర్జాతీయంగా యూపీఐ సేవలు

మనదేశంలో ఇప్పుడు ముప్పావు వంతు చెల్లింపులు యూపీఐ ద్వారానే జరుగుతున్నాయి. ఇప్పటివరకు మనదేశంలో మాత్రమే ఈ సేవలు అందుబాటులో ఉండగా, త్వరలో అంతర్జాతీయ లావాదేవీల్లో యూపీఐ సేవలు వాడుకునే అవకాశం రానుంది. దీనికోసం గ్లోబల్ పేమెంట్ కంపెనీ పేపాల్ కొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చింది. పేపాల్ వరల్డ్ అనే కొత్త ప్లాట్‌ఫామ్ ద్వారా అంతర్జాతీయంగా ఉన్న అతిపెద్ద చెల్లింపుల వ్యవస్థలు, డిజిటల్ వ్యాలెట్లను ఒకచోట చేరుస్తుంది. ఇందులో భాగంగా ఎన్‌పీసీఐ ఇంటర్నేషనల్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్టు పేపాల్ ప్రకటించింది. దీంతో యూపీఐ వినియోగదారులు త్వరలో పేపాల్ కస్టమర్లతో పీ2ఫ్ (పీర్‌టుపీర్) లావాదేవీలను చేయవచ్చు. మరింత సులభంగా చెప్పాలంటే, ప్రపంచంలో ఎక్కడి నుండైనా ఒకరికొకరు డబ్బు పంపే వీలుంటుంది. ప్రస్తుతం, ఈ ఫీచర్ యూఎస్‌ఆధారిత చెల్లింపు సేవలందించే వెన్మోకి మాత్రమే అందుబాటులో ఉంది. అంతేకాకుండా, యూపీఐ కస్టమర్లు త్వరలో ఆన్‌లైన్‌లో షాపింగ్ చేసే అవకాశం, పేపాల్‌ను అంగీకరించే ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రదేశాలలో రిటైల్ స్టోర్లలో కూడా అందుబాటులోకి రావచ్చు. ఈ ఫీచర్ 2026 పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.

## అవి నన్నెంతో భయపెడుతున్నాయి: ఆర్థిక సంస్థల్లో 'వాయిస్‌ప్రింట్'పై ఆల్‌ట్‌మన్ ఆందోళన



ఈ సాంకేతిక యుగంలో మానవాళి సాధించిన గొప్ప విజయాల్లో ఒకటైన కృత్రిమ మేధ అంతే స్థాయిలో ప్రమాదకరమైనది కూడా..! ఏఐతో ఎన్నో ప్రయోజనాలున్నా.. కొందరు ఈ టెక్నాలజీని దుర్వినియోగం చేస్తున్నారు. దీనిని ఉద్దేశించే ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్ ఆల్‌ట్‌మన్ ఓ హెచ్చరిక చేశారు. రాబోయే రోజుల్లో బ్యాంకుల వంటి ఆర్థిక సంస్థలు ఎదుర్కోబోయే సంక్షోభం గురించి ఆందోళన వ్యక్తంచేశారు.
వాషింగ్టన్‌లో జరిగిన ఫెడరల్ రిజర్వ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ.. ''వాయిస్‌ప్రింట్‌ను ప్రామాణికంగా భావించే ఆర్థిక సంస్థలు ఇప్పటికీ ఉన్నాయి. ఇది నన్ను ఎంతగానో ఆందోళన కలిగిస్తోన్న అంశం. దీనికి కాలం చెల్లింది. ఏఐ దానిని చెల్లుబాటు కాకుండా చేస్తుంది'' అని అన్నారు. భద్రతా తనిఖీలను దాటవేసి, డబ్బును తరలించడానికి ఒక వ్యక్తి గళాన్ని అనుకరించే సామర్థ్యం ఏఐటూల్స్ సొంతమని గుర్తుచేశారు. ఏఐ వాయిస్ క్లోన్లు, వీడియో క్లోన్లు అచ్చంగా నిజమైన వాటిలా అనిపిస్తాయి. అసలు ఏదో.. నకిలీ ఏదో.. గుర్తించడానికి అధునాతన పద్ధతులు అనుసరించాల్సిన పరిస్థితి ఉంది. దశాబ్దం క్రితం ఈ వాయిస్‌ప్రింట్ ఎంతో ఆదరణ పొందింది. బ్యాంకులు సంపన్న వినియోదారుల కోసం దీనిని ఉపయోగిస్తున్నారు. దాని ద్వారా వారు తమ అకౌంట్లను యాక్సెస్ చేసుకునే వీలుంది.

కృత్రిమ మేధ గురించి గతంలోనూ ఈ చాట్‌జీపీటీ సృష్టికర్త, ఓపెన్ ఏఐ సీఈఓ హెచ్చరించిన సంగతి తెలిసిందే. ''ఏఐ ఎలాంటి మాయ అయినా చేస్తుంది. అందుకే చాట్‌జీపీటీపై ప్రజలు విపరీతమైన విశ్వాసం చూపిస్తున్నారు. ఇది ఆసక్తికర విషయమే అయినా.. దీన్ని మీరు అంతగా నమ్మకూడదు. కృత్రిమ మేధ రంగంలో చాట్‌జీపీటీ వంటి ఏఐ మోడళ్లు యూజర్ల అవసరాలను తీర్చేందుకు కొన్నిసార్లు వాస్తవాలతో రాజీపడి కల్పిత సమాచారాన్ని సృష్టిస్తుంటాయి. అసలు ఉనికిలోని లేని అంశానికి కూడా చక్కగా తప్పుడు సమాచారం ఇస్తుంటాయి'' అని వివరించారు. వాస్తవిక ప్రపంచంలోనే అసలైన శక్తి ఉంటుందన్నారు.



## రాణించిన బ్యాంక్, ఆటో స్టాక్స్.. లాభాల్లో ముగిసిన సూచీలు

**ముంబయి**: అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలతో మన సూచీలు లాభాల్లో ముగిశాయి. యూఎస్ జపాన్ మధ్య ట్రేడ్ డీల్ కుదిరిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడంతో ఆసియా సహా, మన మార్కెట్లూ రాణించాయి. ఆగస్టు 1 డెడ్‌లైన్‌కు ముందే మరిన్ని ట్రేడ్ డీల్స్ కుదరొచ్చన్న సంకేతాలిచ్చింది. ముఖ్యంగా ఆటో, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో కొనుగోళ్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 500 పాయింట్లకు పైగా లాభపడగా.. నిఫ్టీ 25,200 ఎగువన ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 82,451.87 పాయింట్ల లాభంతో (క్రితం ముగింపు 82,186.81) వద్ద లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 82,786.43 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. 539.83 పాయింట్ల లాభంతో 82,726.64 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 159 పాయింట్ల లాభంతో 25,219.90 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.43గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా మోటార్స్, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్ ఫైనాన్స్, మారుతీ సుజుకీ, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. హిందుస్థాన్ యూనిలీవర్, బీఈఎల్, అల్ట్రాటెక్ సిమెంట్, ఐటీసీ, టైటాన్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 68.10 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3,437.60 డాలర్లు ట్రేడవుతోంది.

# ఐటీ రిటర్న్ కొత్త డెడ్‌లైన్.. మిస్ అయితే పెద్ద తలనొప్పే!






**దేశంలో ప్రస్తుతం ఆదాయపు పన్ను రిటర్నుల (ఐటీఆర్) సీజన్ నడుస్తోంది. ఐటీ రిటర్నులు దాఖలు చేయడం భారతీయ పన్ను చెల్లింపుదారులందరికీ కీలకమైన బాధ్యత. అన్ని ఆదాయ మార్గాలను ప్రకటించడం, అర్హత వ్యయాలను మినహాయించడం, పన్ను బాధ్యతలను ఆదాయపు పన్ను శాఖకు నివేదించడంతో పాటు పన్ను చట్టాలను పాటించడం అవసరం.**

**ఐటీఆర్ దాఖలుకు కొత్త డెడ్‌లైన్**
2024-25 ఆర్థిక సంవత్సరానికి (అసెస్మెంట్ ఇయర్ 2025-26) నాన్ ఆడిట్ పన్ను చెల్లింపుదారులు తమ ఐటీఆర్ దాఖలు చేయడానికి సాధారణంగా జూలై 31 వరకూ గడువు ఉంటుంది. అయితే ఈసారి గడువును 2025 సెప్టెంబర్ 15 వరకు పొడిగించారు. ఒకవేళ గడువు దాటితే ఆలస్య రుసుము, వడ్డీ చెల్లించి 2025 డిసెంబర్ 31లోగా లేట్ రిటర్న్ దాఖలు చేయవచ్చు.

**గడువు దాటిపోతే పర్యవసానాలు**
ఐటీఆర్ దాఖలు చేయకుండా గడువు దాటిపోతే సెక్షన్ 234ఏ కింద తీవ్రమైన జరిమానాలు, అభియోగాలు, సెక్షన్ 234ఎఫ్ కింద ఆలస్య రుసుము చెల్లించాల్సి ఉంటుంది.
**వడ్డీ:** గడువు తర్వాత మీరు మీ రిటర్న్ సబ్మిట్ చేస్తే, సెక్షన్ 234ఏ కింద చెల్లించని పన్ను మొత్తంపై నెలకు 1% లేదా ఒక నెలలో కొంత భాగం వడ్డీ చెల్లించాలి.

**ఆలస్య రుసుము:** సెక్షన్ 234ఎఫ్ కింద ఆలస్య రుసుము వసూలు చేస్తారు. రూ.5 లక్షలకు పైగా ఆదాయం ఉంటే రూ.5,000, రూ.5 లక్షల లోపు ఆదాయం ఉంటే రూ.1,000 ఆలస్య రుసుము వసూలు చేస్తారు.
**నష్టాల సర్దుబాటు:** స్టాక్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్, ఇళ్లు లేదా మీ వ్యాపారాల నుండి మీకు నష్టాలు వచ్చి ఉంటే వాటిని మరుసటి సంవత్సరం మీ ఆదాయానికి వ్యతిరేకంగా సర్దుబాటు చేసుకోవచ్చు. దీనివల్ల తరువాతి సంవత్సరాలలో మీరు చెల్లించాల్సిన పన్ను గణనీయంగా తగ్గుతుంది. అయితే గడువులోగా ఐటీఆర్ దాఖలు చేయకపోతే ఈ నష్టాలను సర్దుబాటు చేసుకునే వెసులుబాటు ఉండదు. ఐటీ రిటర్న్ కొత్త డెడ్‌లైన్.. మిస్ అయితే పెద్ద తలనొప్పే!

# ఉద్యోగం ఆఫర్ చేసి.. జాయినింగ్ డేట్లు ఇవ్వడం లేదు: టీసీఎస్‌పై కేంద్ర మంత్రికి ఫిర్యాదు

**వివిధ కంపెనీల్లో రెండేళ్ల నుంచి ఎనిమిదేళ్ల మధ్య ఉన్న ఉద్యోగులకు టీసీఎస్ కొలువులు ఆఫర్ చేసి.. ఆపై జాయినింగ్ డేట్లు ఇవ్వడం లేదని కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మండవీయాకు బాధితులు ఫిర్యాదు చేశారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. నాస్‌సెంట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎంప్లాయిస్ సెనెట్ ఈమేరకు కేంద్రానికి లేఖ రాసింది. దాదాపు 600 మంది అనుభవం ఉన్న వ్యక్తులకు ఆఫర్ లెటర్లు ఇచ్చి జాయినింగ్‌లో మాత్రం ఎడతెగని జాప్యం చేస్తోందని పేర్కొంది. సదరు ఉద్యోగులు ఆర్థిక, మానసిక, వృత్తిపరంగా దెబ్బతింటున్నారని ఆందోళన వ్యక్తంచేసింది.**



**అసలు విషయం ఏమిటీ..?**
జులై 22వ తేదీన కేంద్ర మంత్రి మాండవీయకు రాసిన లేఖలో కీలక విషయాలను ప్రస్తావించింది. పలువురు వ్యక్తులకు టీసీఎస్ నుంచి అధికారికంగా జాబ్ ఆఫర్ అందిన తర్వాత.. జాయినింగ్ డేట్‌ను మాత్రం వాయిదా వేస్తూ వస్తోందని ఎకనామిక్ టైమ్స్ కథనంలో పేర్కొంది. ఈ అభ్యర్థులంతా బెంగళూరు, హైదరాబాద్, పుణె, కోల్‌కతా, ముంబయి, దిల్లీ ప్రాంతాలకు చెందినవారు. వీరికి 28 ఏళ్ల మధ్య అనుభవం ఉంది. సదరు అభ్యర్థులు తమ పాత ఉద్యోగాలకు రాజీనామా లేఖలను సమర్పించారు. వాస్తవానికి వారు తొలుత జాయినింగ్ కోసం టీసీఎస్‌కు వెళ్లగా.. దానిని వాయిదా వేసి.. ఆ తర్వాత ఎటువంటి అప్‌డేట్లు పంపలేదు. ఫలితంగా ఈ నిపుణులు ఆర్థికంగా, మానసికంగా, వృత్తిపరంగా కుంగిపోతున్నారని ఆ లేఖలో పేర్కొంది. దీనిపై అధ్యక్షుడు, ముంబయి హైకోర్టు న్యాయవాది హర్‌ప్రీత్ సింగ్ సలుజా మాట్లాడుతూ అభ్యర్థులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నట్లు పేర్కొన్నారు.

**టీసీఎస్ ఏముంటోందంటే..?**
మరోవైపు ఈ అంశంపై టెక్ దిగ్గజం టీసీఎస్ స్పందించింది. తాము ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నట్లు చెప్పిందని ఎకనామిక్ టైమ్స్ రిపోర్ట్‌లో పేర్కొంది. ''ఎప్పటిలానే మేము ఆ విషయాన్ని ధ్రువీకరిస్తున్నాం. మేము ఇచ్చిన అన్ని ఆఫర్లను పూర్తి చేస్తాము. అది ఫ్రెషర్స్ అయినా.. అనుభవజ్ఞులైనా. టీసీఎస్ నుంచి ఆఫర్ లెటర్ అందుకొన్న ప్రతిఒక్కరూ కంపెనీలో ఉంటారు. మా వ్యాపారం డిమాండ్ ఆధారంగా జాయినింగ్ డేట్లు ఆధారపడి ఉంటాయి. మరికొన్ని కేసుల్లో అవి వ్యాపార అవసరాలకు తగినట్లు మారుతుంటాయి. ఈ కేసుకు సంబంధించి అభ్యర్థులందరితో మేము టచ్‌లో ఉన్నాము. వారు మా కంపెనీలో చేరేందుకు ఎదురుచూస్తున్నాం'' అని పేర్కొంది.

టీసీఎస్ అభ్యర్థుల జాయినింగ్ డేట్లకు సంబంధించి కచ్చితంగా టైమ్‌లైన్ ప్రకటించేలా జోక్యం చేసుకోవాలని కార్మిక శాఖను కోరింది. జాప్యానికి తగిన ఆర్థిక పరిహారం కూడా ఇప్పించాలని, టీసీఎస్ ఎంప్లాయిస్ అసిస్టెంట్ ప్రోగ్రాం ద్వారా అభ్యర్థులు కోలుకొనేటట్లు సాయం చేయాలని కోరింది.

# హోండా @25.. స్ప్లెండర్‌కు పోటీ షైన్ 100 DX

**ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ భారత్‌లో అడుగుపెట్టి 25 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా హోండా రెండు మోటర్ సైకిళ్లను ఆవిష్కరించింది. హీరో స్ప్లెండర్‌కు పోటీగా షైన్ 100 డీఎక్స్‌ను తీసుకురాగా.. కొత్తగా సీబీ125 హార్నెట్‌ను ఆవిష్కరించింది. ఈ రెండు మోటర్‌సైకిళ్లు ఆగస్టు 1 నుంచి బుకింగ్‌కు అందుబాటులో ఉంటాయి.**




షైన్ డిజైన్‌ను కొనసాగిస్తూ షైన్ 100 డీఎక్స్‌ను కొత్త గ్రాఫిక్స్‌లో తీసుకొచ్చారు. ఇందులో 98.98 సీసీ ఫ్యుయెల్ ఇంజక్టెడ్ ఇంజిన్‌ను అమర్చారు. ఇది 7500 ఆర్‌పీఎం వద్ద 7.28 బీహెచ్‌పీ శక్తిని విడుదల చేస్తుంది. అలాగే 5000 ఆర్‌పీఎం వద్ద 8.04 ఎన్‌ఎం టార్క్‌ను అందిస్తుంది. దీనిలో 4 స్పీడ్ ట్రాన్స్‌మిషన్ ఇచ్చారు. హోండా ఎన్‌హాన్స్‌డ్ స్మార్ట్ పవర్ (ఈఎస్‌పీ)పై సాంకేతికతో పని చేస్తుంది. దీనివల్ల మెరుగైన సామర్థ్యం, పనితీరు కనబరుస్తుందని కంపెనీ ప్రకటించింది. పొడవైన సీటు, రియల్‌టైమ్ మైలేజ్‌రేంజ్ ఇండికేటర్లతో కూడిన కొత్త డిజిటల్ ఎల్‌సీడీ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్ ఇచ్చారు. సైడ్ స్టాండ్ ఇంజిన్ కటాఫ్ కూడా ఉంది. సీబీఎస్ బ్రేకింగ్ సిస్టమ్‌ను అమర్చారు. 168 మి.మీ గ్రౌండ్ క్లియరెన్స్‌తో వస్తున్న ఈ బైక్ ఇంపీరియల్ రెడ్ మెటాలిక్, జెనీ గ్రే మెటాలిక్, అథ్లెటిక్ బ్లూ మెటాలిక్ కలర్స్‌లో లభిస్తుంది.

**ఇక సీబీ 125 హార్నెట్ విషయానికొస్తే..**
దీన్ని యువత కోసం ప్రత్యేక డిజైన్‌తో తీసుకొచ్చారు. పూర్తి ఎల్‌ఈడీ లైటింగ్, అధిక సామర్థ్యం గల ఇంధన ట్యాంక్‌ను ఇచ్చారు. దీనిలో 123.94సీసీ ఫ్యుయెల్ ఇంజక్టెడ్ ఇంజిన్‌ను అమర్చారు. ఇది 7500 ఆర్‌పీఎం వద్ద 10.99 బీహెచ్‌పీ శక్తిని ఉత్పత్తి చేస్తుంది. అలాగే 6000 ఆర్‌పీఎం వద్ద 11.2ఎన్‌ఎమ్ శక్తిని అందిస్తుంది. దీనిలో 5స్పీడ్ గేర్‌బాక్స్ అమర్చారు. ఇది 5.4 సెకన్లలోనే 0 నుంచి 60 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. దీంతోపాటు 4.2అంగుళాల టీఎఫ్‌టీ డిస్‌ప్లే, బ్లూటూత్ కనెక్టివిటీ, హోండా రోడ్‌సింక్ యాప్ ఇంటిగ్రేషన్, ఏబీఎస్, ఇంజన్ స్టాప్ స్విచ్‌ను ఇచ్చారు. సీబీ 125 హార్నెట్ నాలుగు డ్యూయల్‌టోన్ కలర్ ఆప్షన్లలో లభిస్తుంది.

**హీరో నుంచి హెచ్‌ఎఫ్ డీలక్స్ ప్రో**
ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ హీరో మోటోకార్ప్ హెచ్‌ఎఫ్ డీలక్స్ ప్రో విడుదల చేసింది. ఈ బైక్ ప్రారంభ ధర రూ.73,550గా కంపెనీ నిర్ణయించింది. మైలేజ్‌కి ప్రాధాన్యత ఇస్తూ రూపొందించిన తాజా వేరియంట్‌ను కొత్త ఫీచర్లతో తీసుకొచ్చారు. ఈ కొత్త వేరియంట్ ముందున్న మోడళ్ల మాదిరిగానే 97.2 సీసీ ఇంజిన్‌తో వస్తోంది. ఇది 8000 RPM వద్ద 7.9 బీఎచ్‌పీ శక్తిని విడుదల చేస్తుంది. 6000 RPM వద్ద 8.05Nm టార్క్‌ను విడుదల చేస్తుంది. ఈ బైక్‌లో i3S టెక్నాలజీతో పనిచేస్తుందని, తద్వారా మెరుగైన మైలేజ్ ఇస్తుందని కంపెనీ చెబుతోంది.


# టాక్ ఆఫ్ ది టౌన్‌గా 'సైయారా'.. ఈ బాలీవుడ్ మూవీలో ఏముంది?

**స్టార్ నటులు లేరు. పెద్దగా ప్రచారమూ చేయలేదు. అసలు 'సైయారా' అనే సినిమా ఉందనే విషయమే చాలా మందికి తెలియదు. ఎలాంటి అంచనాలు లేకుండా ఈ నెల 18న బాక్సాఫీసు ముందుకొచ్చి, టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. మౌత్ టాక్ పవర్ ఏంటో మరోసారి రుజువు చేసింది. అసలు ఈ చిత్రంలో ఏముంది?**

**భావోద్వేగమే బలం..**
ఇందులో భారీ ఫైట్స్ లేవు. పవర్‌ఫుల్ డైలాగ్స్ లేవు. కళ్లు చెదిరే విజువల్ ఎఫెక్ట్స్ కూడా లేవు. ఎమోషన్ మాత్రమే ఉంది. అదే సినిమాని నిలబెట్టింది. పోనీ భారతీయ సినీ చరిత్రలో ఇప్పటి వరకూ రాని ప్రేమకథా? కానే కాదు. సింపుల్ స్టోరీనే. క్రిష్ కపూర్‌కు సంగీతమంటే ప్రాణం. గొప్ప కంపోజర్ కావాలన్నది అతడి కల. ఓ సందర్భంలో క్రిష్‌ని చూసిన జర్నలిస్టు, లిరిసిస్ట్ వాణీ బాత్రా అతడిని ఇష్టపడుతుంది. ఆ పరిచయం ప్రేమగా మారుతుంది. అదే సమయంలో.. ప్రేమ పేరుతో వాణిని మోసం చేసిన మహేశ్ మళ్లీ ఆమె జీవితంలోకి వస్తాడు. అప్పటికే మానసిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న వాణి ఎలాంటి నిర్ణయం తీసుకుంది? మహేశ్ రాకతో క్రిష్‌లో వచ్చిన మార్పేంటి? అనుకున్న లక్ష్యం చేరాడా? మహేశ్, క్రిష్‌లలో వాణి ఎవరిని వివాహం చేసుకుంది? అన్నది క్లుప్తంగా ఈ సినిమా కథాంశం.

**ఇద్దరూ కొత్తేవారే అయినా..**
క్రిష్, వాణి పాత్రలు. వాటిని పోషించిన అహాన్ పాండే , అనీత్ పడ్డా ప్రేక్షకుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. తొలి ప్రయత్నంలోనే నటనలో పరిణతి చూపించి, కొత్తవారనే ఆలోచన రాకుండా చేశారు. అహాన్ మరెవరో కాదు.. నటుడు చంకీ పాండే సోదరుడైన చిక్కీ పాండే కుమారుడు. కొన్ని కమర్షియల్ యాడ్స్, 'సలామ్ వెంకీ' సినిమాలో నటించిన అనీత్ 'సైయారా'తో హీరోయిన్ అయింది. ఈ చిత్రానికి యాక్టర్స్‌తోపాటు సంగీతం మరో బలం. సందర్భానుసారం వచ్చే పాటలు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ హృదయాన్ని హత్తుకుంటాయి. ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీ, మ్యూజిక్‌ను బట్టి ఈ సినిమాని కొందరు హిట్ మూవీ 'ఆషికీ 2'తో పోలుస్తున్నారు. విశేషమేంటంటే.. రెండింటినీ తెరకెక్కించింది ఒకే దర్శకుడు.. మోహిత్ సూరి . మరోవైపు, ఇది ఓ కొరియన్ మూవీ రీమేక్ అన్న చర్చా జరుగుతోంది.

**నాలుగు రోజుల్లోనే రూ.100 కోట్ల క్లబ్‌లోకి..**
రొమాంటిక్ చిత్రాలకు కేరాఫ్ అయిన బాలీవుడ్ మేకర్స్ కొంతకాలంగా యాక్షన్ బాట పట్టిన సంగతి తెలిసిందే. విజయం దక్కట్లేదన్నది గుర్తించినా.. మాస్ అంశాల చుట్టూనే తిరుగుతున్నారు. మోహిత్ కూడా 'ఆషికీ 2' తర్వాత వేరే సినిమాలు చేసినా ఆ స్థాయి క్రేజ్ రాలేదు. పైగా పాన్ ఇండియా ట్రెండ్ ఉండనే ఉంది. ఏదో అద్భుతం చూపిస్తేనే ఆడియన్స్ థియేటర్స్ వస్తారనే అభిప్రాయం చాలా మందిది. అందుకే 'సైయారా' ప్రారంభించిన సమయంలో.. 'ఇప్పుడు లవ్‌స్టోరీనా? పైగా కొత్తవారితో?' అంటూ పెద్ద పెద్ద దర్శక, నిర్మాతలే చిన్నచూపు చూసేవారని మోహిత్ ఓ ఇంటర్వ్యూలో అన్నారు. అందుకే ఈ సినిమాని నిర్మించేందుకు చాలామంది ముందుకు రాలేదట. తమ అనుభవంతో ప్రముఖ నిర్మాణ సంస్థ యశ్ రాజ్ ఫిల్మ్స్ ఈ సినిమా విజయాన్ని ముందే గుర్తించి, దర్శకుడికి అవకాశం ఇచ్చింది. విడుదలైన నాలుగు రోజుల్లోనే రూ.100 కోట్లకుపైగా వసూలు చేసి, బాలీవుడ్‌కు కొత్త కళ తీసుకొచ్చింది. కంటెంటే ముఖ్యమన్న విషయాన్ని గుర్తుచేసింది. ఉత్తరాదిలోనే కాదు దక్షిణాదిలోనూ అదే మ్యాజిక్ క్రియేట్ చేస్తోంది. మహేశ్ బాబు, సుకుమార్ లాంటి సినీ సెలబ్రిటీలు సైతం ఈ సినిమాకి ఫిదా అయ్యారు.






# నేను 12 గంటలైనా వర్క్ చేయగలను..: విద్యాబాలన్



కొన్ని రోజులుగా చర్చనీయాంశంగా మారిన వర్కింగ్ అవర్స్ అంశంపై నటి విద్యాబాలన్ తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. కొత్తగా తల్లి అయిన వారికి పరిమిత పని గంటలు ఉండాలని ఆమె అన్నారు. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి 20 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె.. ఈ విషయంపై మాట్లాడారు. దీపికా పదుకొణె ఎక్కువ పని గంటల కారణంగా ఓ భారీ ప్రాజెక్ట్‌ను వదులుకున్నట్లు వచ్చిన వార్తలపై స్పందించారు. కొత్తగా తల్లి అయిన వారికి మద్దతు ఇవ్వాలని దీనికోసం సానుభూతితో కూడిన పని సంస్కృతి అవలంబించాల్సిన అవసరం ఉందని విద్యాబాలన్ అన్నారు. ''బిడ్డకు జన్మనిచ్చిన మహిళలు కుటుంబంతో ఎక్కువ సమయం గడపాలి. వారికి బాధ్యతలు ఎక్కువ ఉంటాయి. అలాంటి వారికి అవకాశం ఇవ్వాలంటే కచ్చితంగా కొన్ని మార్పులు చేయాల్సిందే. వారికి అనువైన పని గంటలు ఉండడం చాలా ముఖ్యం. వారితో పోలిస్తే నాలాంటి వారికి బాధ్యతలు తక్కువగా ఉంటాయి కాబట్టి ఎక్కువ సమాయన్ని షూటింగ్‌లకు కేటాయించగలం. నేను 12 గంటలైనా చిత్రీకరణలో పాల్గొనడానికి సిద్ధంగా ఉన్నాను. ప్రపంచంలో ఏ ప్రాంతంలో షూటింగ్ చేసినా పాల్గొనగలను'' అని విద్యాబాలన్ స్పష్టంచేశారు. ఇన్నేళ్ల కెరీర్‌లో ఎంతో ఒత్తిడికి గురైనట్లు విద్యాబాలన్ చెప్పారు. ప్రస్తుతం ఒత్తిడికి దూరంగా ఉంటూ సమయాన్ని ఆస్వాదిస్తున్నట్లు తెలిపారు. తన వద్దకు వచ్చిన స్క్రిప్ట్‌లను పరిశీలించి ఓకే చేస్తున్నట్లు చెప్పారు. రెండు సినిమాలు అంగీకరించానని త్వరలోనే వాటి వివరాలు తెలుపుతానని అన్నారు. 2005లో 'పరిణీత' సినిమాతో విద్యాబాలన్ బాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. సిల్క్‌స్మిత జీవితకథ ఆధారంగా తెరకెక్కిన చిత్రం 'ది డర్టీ పిక్చర్'తో విద్యాబాలన్‌కు మంచి గుర్తింపు వచ్చింది. చివరిగా కార్తిక్ ఆర్యన్ హీరోగా నటించిన 'భూల్ భూలయ్యా 3'లో కనిపించారు. ఈ సినిమా రూ.400 కోట్లకు పైగా వసూలు చేసి బాలీవుడ్‌లో గతేడాది విడుదలైన చిత్రాల్లో టాప్‌లో నిలిచింది.

# రతన్ టాటా కూడా పెళ్లి చేసుకోలేదు కదా: నిత్యామేనన్



సెలక్టివ్‌గా సినిమాలు చేస్తూ అభిమానులను సొంతం చేసుకున్నారు నటి నిత్యా మేనన్ . ప్రస్తుతం ఆమె నటించిన 'సార్ మేడమ్' విడుదలకు సిద్ధంగా ఉంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ప్రేమపై తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. ప్రపంచంలో ప్రతిఒక్కరికీ ప్రేమ వివాహం చేసుకోవడం సాధ్యం కాదన్నారు.

''ప్రేమ గురించి ఎన్నో సంవత్సరాల క్రితం ఆలోచించాను. ఇప్పుడు దానికి నా జీవితంలో అధిక ప్రాధాన్యం ఇవ్వడం లేదు. తల్లిదండ్రులు, కుటుంబం, సమాజం కారణంగా సోల్‌మేట్ ఉండడం అనివార్యమని గతంలో అనిపించేది. అతడిని వెతికిన సందర్భాలూ ఉన్నాయి. అయితే మనం వేరేరకంగా కూడా జీవితాన్ని ఆనందించవచ్చని తర్వాత అర్థం చేసుకున్నాను. ప్రతిఒక్కరికీ ప్రేమించిన వ్యక్తినే జీవిత భాగస్వామిగా చేసుకోవడం సాధ్యం కాదు కదా!. రతన్ టాటా కూడా వివాహం చేసుకోలేదు. పెళ్లి అనేది జీవితంలో ఓ భాగం మాత్రమే.. అది జరిగినా.. జరగకపోయినా మార్పు ఉండదు. తోడు లేనందుకు ఒక్కోసారి బాధ కలిగినప్పటికీ, స్వేచ్ఛగా జీవిస్తున్నందుకు ఆనందంగా ఉంది. జీవితంలో జరిగిన కొన్ని అనుభవాల నుంచి నేర్చుకున్న పాఠాల కారణంగానే నేను ప్రస్తుతం ఈ స్థితిలో ఉన్నాను. ఏది జరిగినా మన మంచికే అనుకొని ముందుకుసాగాలి'' అని నిత్యా మేనన్ తెలిపారు.

ప్రస్తుతం నిత్యా మేనన్ 'సార్ మేడమ్'తో పలకరించేందుకు సిద్ధంగా ఉన్నారు. పాండిరాజ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా జులై 25న ప్రేక్షకుల ముందుకురానుంది. ఇటీవల విడుదలైన దీని ట్రైలర్ విశేషంగా ఆకట్టుకుంది. ఓ మధ్యతరగతి కుటుంబంలోని భార్యాభర్తల పాత్రల్లో నిత్యామేనన్, విజయ్ సేతుపతి ఎంతో సహజంగా నటించారంటూ, వారి కెమిస్ట్రీపై ప్రశంసలు కురిపిస్తున్నారు.



# మంచు లక్ష్మి మంచి మనసు.. సొంత ఖర్చుతో 12 స్కూళ్లలో..

**నటిగా, నిర్మాతగా, హోస్ట్‌గా తన సత్తా చాటుకుంది మంచు లక్ష్మి . అయితే సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా సరే సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటుంది. టీచ్ ఫర్ ఛేంజ్ అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి పలు ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు స్కూళ్లకు ధీటుగా తయారు చేసింది. ఇప్పటివరకు పదుల సంఖ్యలో ప్రభుత్వ స్కూళ్లను దత్తత తీసుకున్న ఆమె వేలాది మంది విద్యార్థులకు స్మార్ట్ క్లాస్ విద్యను అందించింది.**

**'మంచు'లాంటి మనసు**
**విద్యాదానం కంటే గొప్పది మరొకటి ఉండదని బలంగా నమ్ముతుంది లక్ష్మి. తాజాగా నెల్లూరులోని కోటమిట్టలో డిజిటల్ క్లాసు రూముల ప్రారంభోత్సవంలో పాల్గొంది. క్లాసును అందంగా తీర్చిదిద్దడంతోపాటు గదిలో ఓ టీవీని కూడా ఏర్పాటు చేయించింది. జిల్లాలోని 12 స్కూళ్లలో రూ.2 లక్షల చొప్పున నిధులతో టీవీ, తదితర సౌకర్యాలతో డిజిటల్ క్లాస్‌రూమ్స్ ఏర్పాటు చేయించింది మంచు లక్ష్మి.**


# ఆ టైమ్‌లో యాక్టింగ్ ఆపేయాలనుకున్నా: రెజీనా



**సినీ నేపథ్యం లేకుండా ఇండస్ట్రీకి వచ్చి గుర్తింపు తెచ్చుకున్నారు నటి రెజీనా . ఆమె పరిశ్రమకు వచ్చి 20 ఏళ్లు అయిన సందర్భంగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్ గురించి మాట్లాడారు. 20 ఏళ్ల కెరీర్‌ను మైలురాయిగా ఎందుకు చూస్తారో అర్థమైందన్నారు. కానీ, తాను కొన్ని విషయాల్లో అగ్రస్థానంలో లేనన్నారు. కొన్నేళ్లుగా వరుసగా తెరపై కనిపించనప్పటికీ 20 ఏళ్లంటే చాలా పెద్ద విషయమని చెప్పారు."2015-16 సంవత్సరంలో నాకు పని చేయాలనిపించలేదు. యాక్టింగ్ మానేయాలనుకున్నాను. అంగీకరించిన ప్రాజెక్ట్‌లు పూర్తి చేశాను.**

2018 నుంచి అవకాశాలు వరుస పెట్టాయి. ఒకేతరహా పాత్రల్లో నటించకూడదని నిర్ణయించుకున్నాను. టాలీవుడ్‌లోకి వెళ్లిన తొలినాళ్లలో ఉదయం 6 గంటలకే నాకు డైలాగులు తెచ్చి ఇచ్చేవారు. అప్పుడు నాకు తెలుగు రాదు. దీంతో ఎంతో కష్టపడాల్సి వచ్చింది. అన్ని డైలాగులు కంఠస్థం చేశాను. భావోద్వేగాలను అర్థం చేసుకున్నాను. లైన్ టూ లైన్ నేర్చుకోవడం ప్రాక్టీస్ చేశా. ఇప్పుడు తెలుగు బాగా మాట్లాడగలను. నాకు సినీ నేపథ్యం లేదు. ఇండస్ట్రీకి రావాలనుకున్నప్పుడు నటించి, ఇంటికి వచ్చేయడమే అని భావించాను. కానీ, కాలం గడిచేకొద్దీ పీఆర్‌లు, సోషల్ మీడియా ప్రాధాన్యం గురించి అర్థమైంది. నేను వీటికి చాలా రోజులు దూరంగా ఉన్నాను. నా నటనను చూసి అవకాశం ఇవ్వాలి కానీ, పబ్లిసిటీ చూసి కాదని అనుకున్నాను. కానీ, ఇప్పుడు సోషల్ మీడియా ద్వారానే నా పనిని ప్రేక్షకుల్లోకి తీసుకెళ్తున్నాను'' అని చెప్పారు.

2005లో ఓ తమిళ సినిమాతో ఇండస్ట్రీలోకి వచ్చిన రెజీనా 2010లో 'ఎస్.ఎమ్.ఎస్' చిత్రంతో తెలుగు ప్రేక్షకులను పలకరించారు. 'అ..!', 'ఎవరు' లాంటి సినిమాల్లో విభిన్నమైన రోల్స్‌తో ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరిచారు. గతేడాది అజిత్ 'పట్టుదల'లో నటించి ఆకట్టుకున్నారు. ప్రస్తుతం 'మూకుతి అమ్మన్ 2' లో నటిస్తున్నారు. విజయవంతమైన 'మూకుతి అమ్మన్'కి కొనసాగింపుగా రూపొందుతున్న చిత్రమిది. సుందర్.సి దర్శకత్వంలో రూపొందుతోంది. తొలి చిత్రం తెలుగులో 'అమ్మోరు తల్లి'గా అనువాదమై ఆదరణ పొందింది.



## చరిత్ర సృష్టించిన దివ్య దేశ్‌ముఖ్.. ఫిడే
# వరల్డ్ కప్‌లో ఫైనల్‌కు

భారత మహిళా ఇంటర్నేషనల్ మాస్టర్ దివ్య దేశ్‌ముఖ్ చరిత్ర సృష్టించేందుకు అడుగు దూరంలో నిలిచింది. జార్జియాలో జరుగుతున్న మహిళల ఫిడే వరల్డ్ కప్‌లో ఫైనల్‌కు దూసుకెళ్లింది. వరల్డ్ కప్ చరిత్రలో టైటిల్ పోరుకు చేరుకున్న తొలి భారత గ్రాండ్‌మాస్టర్‌గా రికార్డుకెక్కింది. అలాగే, వచ్చే ఏడాది జరిగే వరల్డ్ చాంపియన్‌షిప్‌కు క్వాలిఫై అయ్యేందుకు జరిగే క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించింది. బుధవారం ముగిసిన సెమీస్‌లో ఆమె మాజీ వరల్డ్ చాంపియన్, చైనాకు చెందిన టాన్ జోంగీని మట్టికరిపించింది. రెండు గేముల్లో జరిగిన మ్యాచ్‌లో దివ్య 1.50.5 తేడాతో విజయం సాధించింది. మంగళవారం జరిగిన తొలి గేములో టాన్ జోంగీతో కలిసి డ్రా చేసుకుంది. ఇక, బుధవారం జరిగిన రెండో గేమును నెగ్గడంతో ఆమె విజయం లాంఛనమైంది. తొలి పావులతో ఆడిన ఆమె 101 ఎత్తుల్లో ప్రత్యర్థిని నిలువరించింది. మరోవైపు, మరో భారత గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి, చైనాకే చెందిన లీ టింగ్జీ మధ్య సెమీస్ ఆసక్తికరంగా సాగుతోంది. రెండో గేములో కూడా ఇద్దరు పాయింట్స్ పంచుకున్నారు. దీంతో రెండు క్లాసికల్ గేమ్స్ ముగిసే సరికి ఇద్దరు 11తో సమంగా నిలిచారు. ఇక, ఫైనల్ బెర్త్ కోసం హంపి టై బ్రేకర్‌లోనే తాడోపేడో తేల్చుకోనుంది.







## వరల్డ్ నం.6కు షాక్ ఇచ్చిన సింధు..
# చైనా ఓపెన్‌లో శుభారంభం

చైనా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ క్రీడాకారిణి పీవీ సింధు శుభారంభం చేసింది. ఉమెన్స్ సింగిల్స్ తొలి రౌండ్‌లో విజయం సాధించింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో 21 15, 821, 2117 తేడాతో వరల్డ్ నం.6, జపాన్ షట్లర్ టోమోకా మియాజాకికి షాకిచ్చింది. గంటకుపైగా నువ్వానేనా అన్నట్టు సాగిన పోరులో సింధు పోరాడి గెలిచింది. తొలి గేమ్ నెగ్గి మ్యాచ్‌ను ఘనంగానే ఆరంభించింది. అయితే, రెండో గేములో ప్రత్యర్థి దూకుడు ముందు తేలిపోయింది. ఆ తర్వాత బలంగా పుంజుకున్న సింధు ప్రత్యర్థిని కట్టడి చేసింది. నిర్ణయాత్మక మూడో గేములో స్పష్టమైన ఆధిపత్యం ప్రదర్శించి రెండో రౌండ్‌లో అడుగుపెట్టింది.

యువ క్రీడాకారిణి ఉన్నతి హుడా కూడా ముందంజ వేసింది. తొలి రౌండ్‌లో ఉన్నతి 2111, 2116 తేడాతో స్కాట్లాండ్‌కు చెందిన క్రిస్టీ గిల్మోర్‌పై విజయం సాధించింది. 36 నిమిషాలపాటు సాగిన మ్యాచ్‌లో ఉన్నతి ఆధిపత్యం ప్రదర్శిస్తూ అలవోకగా నెగ్గింది. అయితే, రెండో రౌండ్‌లో సింధు, ఉన్నతి ఎదురుపడటంతో ఇద్దరిలో ఒక్కరే తర్వాతి రౌండ్‌కు చేరుకోనున్నారు. ఇక, పురుషుల డబుల్‌స్‌లో సాత్విక్ సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టి జోడీ శుభారంభం చేసింది. తొలి రౌండ్‌లో సాత్విక్ జోడీ 21 13, 219 తేడాతో జపాన్‌కు చెందిన హిరోకి ఒకమురాకెన్యా మిత్సుహాషి ద్వయంపై గెలుపొందింది. స్పష్టమైన ఆధిపత్యం ప్రదర్శించిన భారత జంట కేవలం 31 నిమిషాల్లోనే మ్యాచ్ సొంతం చేసుకుని రెండో రౌండ్‌కు చేరుకుంది.

## ఇంగ్లాండ్‌తో నాలుగో టెస్టు.. తొలి రోజు
# ముగిసిన ఆట.. భారత్ 264/4

**మాంచెస్టర్:** ఇంగ్లాండ్, భారత్ మధ్య జరుగుతున్న నాలుగో టెస్టులో తొలి రోజు ఆట ముగిసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమ్‌ఇండియా ఆట ముగిసే సమయానికి 4 వికెట్ల నష్టానికి 264 పరుగులు చేసింది. రవీంద్ర జడేజా (19*; 37 బంతుల్లో 3 ఫోర్లు), శార్దూల్ ఠాకూర్ (19*; 36 బంతుల్లో 2 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. సాయి సుదర్శన్ (61; 151 బంతుల్లో 7 ఫోర్లు), యశస్వి జైస్వాల్ (58; 107 బంతుల్లో 10 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకాలు చేశారు. కేఎల్ రాహుల్ (46; 98 బంతుల్లో 4 ఫోర్లు) రాణించగా.. రిషబ్ పంత్ (37*; 48 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) బ్యాటింగ్ చేస్తుండగా కాలికి గాయం కావడంతో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (12) నిరాశపర్చాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో బెన్ స్టోక్స్ 2, క్రిస్ వోక్స్, లియామ్ డాసన్ చెరో వికెట్ పడగొట్టారు.

ఓపెనర్లు రాహుల్, జైస్వాల్ భారత్‌కు శుభారంభం అందించారు. ఈ జోడీ నిలకడగా ఆడటంతో 78/0తో భారత్ లంచ్‌కు వెళ్లింది. అయితే, రెండో సెషన్‌లో భారత్ మూడు వికెట్లు కోల్పోయింది. క్రిస్ వోక్స్ బౌలింగ్‌లో రాహుల్.. థర్డ్ స్లిప్‌లో జాక్ క్రాలీకి చిక్కాడు. తర్వాత అర్ధ శతకం అందుకున్న జైస్వాల్.. ఎనిమిదేళ్ల తర్వాత టెస్టు ఆడుతున్న లియామ్ డాసన్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. అతను స్లిప్‌లో బ్రూక్‌కు క్యాచ్ ఇచ్చాడు. తర్వాత వచ్చిన గిల్‌ని స్టోక్స్ ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపాడు. దీంతో 149/3తో రెండో సెషన్‌ను ముగించింది. చివరి సెషన్ మొదలైన తర్వాత పంత్, సుదర్శన్ నిలకడగా ఆడటంతో స్కోరు 200 దాటింది. తర్వాత వోక్స్ బౌలింగ్‌లో పంత్ కాలికి గాయమైంది. దీంతో అతను రిటైర్డ్ హర్ట్‌గా మైదానాన్ని వీడాడు. జో రూట్ బౌలింగ్‌లో ఫోర్ కొట్టి టెస్టుల్లో తొలి హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న సుదర్శన్.. స్టోక్స్ బౌలింగ్‌లో కార్స్‌కు చిక్కాడు.

**పంత్‌కు తీవ్ర గాయం..**

బ్యాటింగ్ చేస్తుండగా పంత్‌కు తీవ్ర గాయమైంది. క్రిస్ వోక్స్ బౌలింగ్ (67.4) ఓవర్‌కు అతను స్వీప్ షాట్ ఆడబోయాడు. కానీ, బంతి బ్యాట్ ఎడ్జ్‌కు తగిలి పంత్ కుడి కాలు పాదానికి బలంగా తాకింది. ఫిజియో వచ్చి చికిత్స చేస్తుండగా పంత్ నొప్పితో విలవిల్లాడాడు. కాలు ఉబ్బిపోయి నడవలేని స్థితిలో ఉండటంతో అతడిని మైదానం నుంచి తీసుకెళ్లారు. గాయం తీవ్రమైనదిగానే కనిపిస్తుండటంతో మళ్లీ అతడు బ్యాటింగ్‌కు దిగుతాడో?లేదో అని అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**తడబడుతోన్న టీమిండియా..**
**మూడు కీలక వికెట్లు డౌన్**

మాంచెస్టర్ లోని ఓల్డ్ ట్రాఫోర్డ్ వేదికగా ఇంగ్లాండ్‌తో జరుగుతున్న నాలుగో టెస్టులో తొలి రోజు ఆటలో భాగంగా టీమిండియా తడబడుతోంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఫస్ట్ సెషన్‌లో వికెట్లు ఏమీ కోల్పోకుండా 78 పరుగులు చేసింది. అనంతరం సెకండ్ సెషన్‌లో టీ విరామ సమయానికి వెంటవెంటనే మూడు కీలక వికెట్లను చేజార్చుకుంది. ఓపెనర్ యశస్వీ జైస్వాల్ 107 బంతుల్లో 58 పరుగులు, హాఫ్ సెంచరీ చేసి డాసన్ బౌలింగ్‌లో అవుటయ్యాడు. మరో ఓపెనర్ కేఎల్ రాహుల్ 98 బంతుల్లో 46 పరుగులు చేసి క్రిస్ వోక్స్ బౌలింగ్ పెవిలియన్ చేరాడు. అనంతరం క్రీజ్‌లోకి వచ్చిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్‌లో కలిసి భాగస్వామ్యం నెలకొల్పేందుకు ప్రయత్నించారు. కానీ, అనూహ్యంగా గిల్ 23 బంతుల్లో 12 పరుగులు చేసి ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ బౌలింగ్‌లో ఎల్బీగా వెనుదిరిగాడు. ప్రస్తుతం టీమిండియా 3 కీలక వికెట్లను కోల్పోయి 165 పరుగులు చేసింది. సాయి సుదర్శన్ 37 బంతుల్లో 35 పరుగులు, కీపర్ రిషభ్ పంత్ 19 బంతుల్లో 10 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. ఇంగ్లాండ్ బౌలర్లలో క్రిస్ వోక్స్, బెన్ స్టోక్స్, లియామ్ డాసన్ ఒక్కో వికెట్ నేలకూల్చారు. కీలక బ్యాట్స్‌మెన్లు ఇప్పటికే పెవీలియన్ చేరడంతో.. భారీ స్కోర్ సాధించాలంటే క్రీజ్‌లో ఉన్న సాయి సుదర్శన్, రిషభ్ పంత్, రవీంద్ర జడేజాలపై జట్టు ఆశలు పెట్టుకుంది.







## ఓటమి అంచుల నుంచి...ఐదు మ్యాచ్ పాయింట్లు
# కాపాడుకొని నెగ్గిన భారత స్టార్ షట్లర్ ప్రణయ్





**తొలి రౌండ్‌లో ప్రపంచ 18వ ర్యాంకర్ కోకి వతనాబెపై విజయం**

**చాంగ్జౌ:** ఈ ఏడాది ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్న భారత స్టార్ షట్లర్ హెచ్‌ఎస్ ప్రణయ్... ప్రతిష్టాత్మక చైనా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నీలో స్ఫూర్తిదాయక ప్రదర్శనతో శుభారంభం చేశాడు. ఓటమి అంచుల్లో ఉన్నప్పటికీ... సంయమనం కోల్పోకుండా ఆడిన ఈ కేరళ ప్లేయర్ ఏకంగా ఐదు మ్యాచ్ పాయింట్లను కాపాడుకొని గట్టెక్కడం విశేషం. ప్రపంచ 18వ ర్యాంకర్ కోకి వతనాబె (జపాన్)తో మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 35వ ర్యాంకర్ ప్రణయ్ 8-21, 21-16, 23-21తో గెలుపొంది ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు.

57 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ప్రణయ్ తొలి గేమ్‌లో తేలిపోయాడు. కేవలం ఎనిమిది పాయింట్లు మాత్రమే సాధించాడు. ఒకసారి వరుసగా ఐదు పాయింట్లు, ఇంకోసారి వరుసగా మూడు పాయింట్లు, మరోసారి వరుసగా నాలుగు పాయింట్లు కోల్పోయిన ప్రణయ్ తొలి గేమ్‌లో ప్రత్యర్థి స్కోరు సమీపానికి కూడా రాలేకపోయాడు. రెండో గేమ్ నుంచి ప్రణయ్ పుంజుకున్నాడు. ఆరంభంలో 2-5తో వెనుకబడ్డ ప్రణయ్ ఆ తర్వాత 5-5తో, 7-7తో, 9-9తో స్కోరును సమం చేశాడు.

స్కోరు 9-9 వద్ద ఉన్నపుడు ప్రణయ్ ఒక్కసారిగా చెలరేగి వరుసగా నాలుగు పాయింట్లు నెగ్గాడు. 13-9తో ఆధిక్యంలోకి వెళ్లాడు. ఆ తర్వాత తన జోరును కొనసాగిస్తూ 15-10తో ముందంజ వేసిన ప్రణయ్ ఈ ఆధిక్యాన్ని కాపాడుకుంటూ రెండో గేమ్‌ను సొంతం చేసుకొని మ్యాచ్‌లో నిలిచాడు. నిర్ణాయక మూడో గేమ్‌లో వతనాబె విజృంభించడంతో మొదట్లో ప్రణయ్‌కు ఏమి చేయాలో తోచలేదు. వరుస పాయింట్లు కోల్పోయిన భారత ప్లేయర్ చూస్తుండగానే 1-10తో వెనుకబడిపోయాడు.

గతంలో థామస్ కప్ టైటిల్ భారత్‌కు తొలిసారి దక్కడంలో కీలకపాత్ర పోషించిన ప్రణయ్ ఈ దశలో పోరాడితే పోయేదేమీ లేదన్నట్లు ఆడాడు. తొమ్మిది పాయింట్ల వ్యత్యాసాన్ని 10-14తో నాలుగు పాయింట్లకు తగ్గించాడు. స్వల్ప ఆధిక్యాన్ని నిలబెట్టుకుంటూ ముందుకు సాగిన వతనాబె 20-15తో విజయం అంచుల్లోకి వచ్చాడు. ఒక్క పాయింట్ గెలిస్తే కెరీర్‌లో ప్రణయ్‌పై వరుసగా రెండోసారి గెలుపు అందుకునేందుకు చేరువైన వతనాబె ఈ దశలో తడబడ్డాడు.

మ్యాచ్ కాపాడుకోవాలంటే ఐదు పాయింట్లు సాధించాల్సిన స్థితిలో ప్రణయ్ తుది ఫలితంపై దృష్టి పెట్టకుండా... ఒక్కో పాయింట్ నెగ్గేలా ఆడాడు. ప్రణయ్ వ్యూహం ఫలితాన్నిచ్చించంది. భారత ప్లేయర్ వరుసగా ఆరు పాయింట్లు నెగ్గి 15-20 నుంచి 21-20తో ఆధిక్యంలో వచ్చేసి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. వరుసగా ఆరు పాయింట్లు కోల్పోయాక వతనాబె ఒక పాయింట్ గెలిచి స్కోరును 21-21తో సమం చేశాడు. ఈ దశలో 33 ఏళ్ల ప్రణయ్ చెలరేగి వరుసగా రెండు పాయింట్లు గెలిచి గేమ్‌తోపాటు చిరస్మరణీయ విజయాన్ని అందుకున్నాడు.

ఈ ఏడాది 11 టోర్నీలు ఆడిన ప్రణయ్ ఒక్క దాంట్లోనూ క్వార్టర్ ఫైనల్ చేరుకోలేకపోయాడు. చైనా ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్లో చోటు కోసం ప్రపంచ ఆరో ర్యాంకర్, చైనీస్ తైపీ ప్లేయర్ చౌ టియెన్ చెన్‌తో ప్రణయ్ తలపడతాడు. ముఖాముఖి రికార్డులో ప్రణయ్ 6-7తో వెనుకంజలో ఉన్నాడు. చివరిసారి వీరిద్దరు గత ఏడాది ఇండియా ఓపెన్‌లో తలపడగా... ప్రణయ్ వరుస గేముల్లో గెలిచాడు.

**రెండు మ్యాచ్ పాయింట్లు వదులుకొని...**

పురుషుల సింగిల్స్ మరో మ్యాచ్‌లో భారత నంబర్‌వన్, ప్రపంచ 19వ ర్యాంకర్ లక్ష్య సేన్‌కు తొలి రౌండ్‌లోనే ఓటమి ఎదురైంది. ప్రపంచ ఐదో ర్యాంకర్ లీ షి ఫెంగ్ (చైనా)తో జరిగిన మ్యాచ్‌లో లక్ష్య సేన్ 21-14, 22-24, 11-21తో ఓడిపోయాడు. 67 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో లక్ష్య సేన్ తొలి గేమ్ గెల్చుకొని, రెండో గేమ్‌లో 21-20తో, 22-21తో రెండుసార్లు విజయానికి చేరువయ్యాడు.

కానీ ఈ అవకాశాలను వదులుకున్న లక్ష్య సేన్ చివరకు 22-24తో రెండో గేమ్‌ను కోల్పోయాడు. నిర్ణాయక మూడో గేమ్‌లో లీ షి ఫెంగ్ జోరు పెంచగా... గెలుపు అవకాశాలను వృథా చేసుకున్న లక్ష్య సేన్ డీలా పడి చివరకు 11 పాయింట్లే గెలిచి మ్యాచ్‌ను సమర్పించుకున్నాడు.

మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో అనుపమ (భారత్) 23-21, 11-21, 10-21తో లిన్ సియాంగ్ టి (చైనీస్ తైపీ) చేతిలో పరాజయం పాలైంది. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో సెల్వం కవిప్రియ-సిమ్రన్ (భారత్) 16-21, 14-21తో లౌరెన్ లామ్-అలీసన్ లీ (అమెరికా) చేతిలో... అమృత-సోనాలీ 12-21, 5-21తో సియె పె షాన్-హూంగ్ ఎన్ జు (చైనీస్ తైపీ) చేతిలో ఓటమి చవిచూశారు.

**పోరాడి ఓడిన రుత్విక–రోహన్ జోడీ**
**మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత జోడీలకు నిరాశ ఎదురైంది. తెలంగాణ అమ్మాయి గద్దె రుత్విక శివాని–రోహన్ కపూర్ (భారత్), అశిత్ సూర్య–అమృత జోడీలు తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాయి. రుత్విక–రోహన్ ద్వయం 64 నిమిషాలు పోరాడి 27–25, 16–21, 14–21తో వోంగ్ టియెన్ సి–లిమ్ చియె సియెన్ (మలేసియా) చేతిలో... అశిత్–అమృత 12–21, 17–21తో రెహాన్–గ్లోరియా (ఇండోనేసియా) చేతిలో ఓడిపోయారు.**

**ప్రస్తుతం నా కెరీర్‌లో ప్రతీ విజయం ముఖ్యం.**

గాయం నుంచి కోలుకుని మళ్లీ టోర్నీలు ఆడుతున్నందుకు ఆనందంగా ఉంది. స్వల్ప విరామాలు తీసుకుంటున్నాను. బ్యాడ్మింటన్‌లో పోటీతత్వం విపరీతంగా పెరిగిపోయింది. ప్రతీ రౌండ్‌లో గెలిచి ముందుకెళ్లడం రోజురోజుకీ క్లిష్టంగా మారిపోతోంది. పురుషుల సింగిల్స్‌లో ఆటగాళ్ల సగటు వయసు 22-23గా ఉంది. తెరపైకి ఒక్కసారిగా కొత్త వాళ్లు దూసుకొస్తున్నారు. వారు ఎలా ఆడతారో ముందస్తుగా తెలియడంలేదు. సీనియర్‌గా ఉంటూ యువ ప్రతిభావంతులతో పోరాడాలంటే కాస్త కష్టమే.